thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 33 | జగిత్యాల | బుధవారం | 22 ఏప్రిల్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |



సొంతగడ్డపై సన్ రైజర్స్ శివతాండం



11

## ఇరాన్‌తో చర్చలకు సిద్ధం

4



- 'శాంతి' దిశగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు!
- అభ్యంతరం లేదన్న అగ్రరాజ్య అధినేత..
- బెదిరింపులకు లొంగం: ఇరాన్

## 'పడకగది' దుమారం

బిహార్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాజకీయ వర్గాల్లో అగ్గి రాజేశారు. మహిళల రాజకీయ ఎదుగుదలను కించపరిచే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 90 శాతం మంది మహిళల రాజకీయ జీవితం నాయకుల 'పడకగది' (బెడ్‌రూమ్) నుంచే ప్రారంభమవు తుందంటూ ఆయన చేసిన అసభ్యకర వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి.

- రాజకీయాల్లో మహిళలపై జుగుప్సాకర విమర్శలు
- బెడ్‌రూమ్ నుంచే మహిళల రాజకీయ ప్రస్థానమంటూ వ్యాఖ్య..
- భగ్గుమన్న మహిళా లోకం..
- రంగంలోకి మహిళా కమిషన్
- ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలని బీజేపీ డిమాండ్

4





## ఉగ్రవాది అని అనలేదు..

- భయపెడుతున్నారని మాత్రమే చెప్పా!
- మోదీపై వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే వివరణ

4

## రెవెన్యూ వ్యవస్థలో నవ శకం

### సర్వే మ్యాప్‌తోనే ఇక భూ రిజిస్ట్రేషన్లు!

### కూసుమంచిలో చారిత్రాత్మక ఘట్టం..

తొలి డాక్యుమెంట్‌ను నమోదు చేసిన మంత్రి పొంగులేటి



- ప్రతి భూమికి ప్రత్యేక 'భూధార్' నంబర్..
- ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభం
- భూ హక్కులకు శాశ్వత భరోసా కల్పిస్తాం





దశాబ్దాలుగా నలుగుతున్న భూ తగాదాలు.. సరిహద్దు గట్ల పంచాయితీలు.. కోర్టుల చుట్టూ తిరిగే రైతన్నల కష్టాలు.. వీటన్నింటికీ ముగింపు పలికే ఆ 'బ్రహ్మాస్త్రం' రాష్ట్రంలో అడుగుపెట్టింది. నిన్నటి వరకు కేవలం కాగితాలకే పరిమితమైన భూ హక్కులకు ఇకపై ఒక డిజిటల్ భద్రత, ఒక స్పష్టమైన మ్యాప్ తోడుకానున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి వేదికగా తెలంగాణ రెవెన్యూ చరిత్రలో ఒక మలుపు తిప్పే ఘట్టానికి మంగళవారం నాంది పలికారు.

**ఖమ్మం, ఏప్రిల్ 21:** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో మంగళవారం సర్వే మ్యాప్‌తో కూడిన తొలి భూ రిజిస్ట్రేషన్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా

మిగతా 2 లో



## చర్చలు విఫలం!

### ఆర్టీసీ సమ్మె యథాతథం

- అర్ధరాత్రి నుంచే నిలిచిపోయిన బస్సులు
- నాలుగు వారాల గడువు కోరిన అధికారులు..
- ససేమిరా అన్న కార్మిక సంఘాలు
- రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై ప్రభావం..

ఆర్టీసీ కార్మికుల సమ్మె అనివార్యమైంది. తమ డిమాండ్ల సాధన కోసం టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఇచ్చిన సమ్మె పిలుపునకు ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. మంగళవారం సాయంత్రం ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిపిన చర్చలు విఫలం కావడంతో, ముందస్తు నిర్ణయం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెలోకి వెళ్తున్నట్లు జేఏసీ నాయకులు అధికారికంగా ప్రకటించారు.



4



## 27న బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు!

- తెలంగాణ భవన్‌లో రజతోత్సవ ముగింపు సభ
- హాజరుకానున్న పార్టీ అధినేత కేసీఆర్

2




కాళేశ్వరం కమిషన్‌పై

## నేడు తీర్పు

- హైకోర్టు 'ఫైనల్ వర్డిక్ట్'
- జస్టిస్ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ..
- కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై నేడే తీర్పు

.. వివరాలు 2లో



2

తెలంగాణలో పెట్టుబడులకు

## అవకాశం

- హెల్త్‌టెక్, ఏఐ రంగాల్లో పెట్టుబడుల వరద..
- త్వరలో 'వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు!
- నార్వే బృందందతో మంత్రి శ్రీధర్ బాబు

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు

## సిద్ధం కండి

కాంగ్రెస్ కార్యకర్తలకు దామోదర సూచన



2

## న్యాయ పోరాటానికే ఢిల్లీ వెళ్లాను!

- అక్రమ కేసులను ఎదుర్కోవడానికే న్యాయవాదులతో చర్చ
- ఓటుకు నోటు కేసు విచారణపై హరీష్ రావు కీలక వ్యాఖ్యలు
- రేవంత్ రెడ్డి భాష, తీరుపై మండిపాటు

3



కేసీఆర్ సూచన మేరకే తాను ఢిల్లీ వెళ్లి న్యాయవాదులను కలిసినట్లు మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడించారు. ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను ఎదుర్కోవడానికే ఈ పర్యటన అని స్పష్టం చేశారు. కాళేశ్వరం కేసులతో పాటు రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానున్న ఓటుకు నోటు కేసు గురించి కూడా న్యాయ నిపుణులతో చర్చించినట్లు తెలిపారు.

## రీల్స్ మోజులో..

- మేడ పైనుంచి పడి 14 ఏళ్ల బాలుడి మృతి
- మల్లాపూర్‌లో విషాదం



3

## త్రిస్సూర్‌పూరం వేళ పెను విషాదం



### 'బాణసంచా' పేలుడులో 13 మంది దుర్మరణం!

- నిమిషాల వ్యవధిలోనే వల్లకాడైన తయారీ కేంద్రం..
- చెల్లాచెదురైన శరీర భాగాలు
- 33 మందికి తీవ్ర గాయాలు..
- పలువురి పరిస్థితి విషమం..
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

4




## కాళేశ్వరం కమిషన్‌పై నేడు తీర్పు

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా, కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు వెలువడే తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో కోర్టు తీసుకునే నిర్ణయం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## తెలంగాణకు 8 కొత్త రైళ్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** రైల్వే మంత్రిత్వ శాఖ తెలంగాణకు ఎనిమిది కొత్త రైళ్లను ప్రకటించింది. హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా ఈ కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నుంచి ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు భువనేశ్వర్, తిరుచానూరు, తిరుపతి, శ్రీ గంగానగర్, జైపూర్ వంటి ముఖ్యమైన నగరాలకు కనెక్టివిటీని పెంచుతాయని, దీంతో ప్రయాణం మరింత సులభతరం అవుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కాగా, ఈ రైళ్లు మే నుంచి జూలై మధ్య దశల వారీగా ప్రారంభం అవుతాయి. రైళ్లన్నీ వారానికి ఒకసారి నడుస్తాయి. కాగా, తెలంగాణకు ఎనిమిది రైళ్లను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

## రీల్స్ మోజులో బిల్డింగ్‌పై నుంచి పడ్డ బాలుడు

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** గంటలు తరబడి రీల్స్ స్క్రోల్ చేస్తూ టైం వేస్ట్ చేసేవారు కొందరైతే... రీల్స్ కోసం రిస్క్ చేసి ప్రాణాల మీదకు తెచుకునేవారు మరికొందరు. రీల్స్ కోసం రిస్క్ చేసి మరో బాలుడు ప్రాణాలు వదిలాడు. హైదరాబాద్ లో దారుణం జరిగింది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ బిల్డింగ్ పై నుంచి జారిపడి బాలుడు మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... హైదరాబాద్ లోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గాంధీ బొమ్మ బస్తీకి చెందిన 14 ఏళ్ళ బాలుడు మితున్ రీల్స్ చేస్తూ బిల్డింగ్ పైనుంచి పడి మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మిథున్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మితున్ బిల్డింగ్ మీద నుంచి కిందపడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాలుడి మృతదేహాన్ని బీహార్ కు తరలిస్తున్నారు బంధువులు. మితున్ మృతితో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, ఏప్రిల్ 21:** తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. ఈ బదిలీల ప్రక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

## ఐఏఎస్ రజత్ అవినీతిపై విచారణ

**కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** తెలంగాణ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ హైకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఐఏఎస్ అధికారిపై వచ్చిన ఫిర్యాదును మూడు నెలల్లోగా తేల్చాలని కేంద్రాన్ని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ల నిధులతో ఐఏఎస్ అధికారి తన కుమార్తె వివాహం నిర్వహించారని, అది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ÷వ్ స్టార్ హోటల్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలకు సంబంధించిన ఖర్చులను కాంట్రాక్టర్లే భరించారని పిటిషనర్ ఆరోపించారు. నాలుగేళ్లుగా కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ ఫిర్యాదుపై తార్కిక ముగింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అధికారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉందన్న ఢిల్లీ హైకోర్టు.. ఈ ఫిర్యాదుపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది.

## ఖర్గేవి దిగజారుడు వ్యాఖ్యలు

**బాధ్యతాయుతమైన వ్యక్తి ఇలాంటి మాటలా**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్,ఏప్రిల్ 21:** ప్రధానమంత్రి నరేంద్రమోదీని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఉగ్రవాది అని సంబోధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపేర్కొన్నారు. ఓ జాతీయ పార్టీ అధ్యక్షుడిగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం గల నాయకుడిగా ఖర్గేకు పేరు ఉందని ప్రస్తావించారు. బాధ్యాతాయుతమైన ప్రధానమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై.. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. ఖర్గే.. మోదీపై పదే పదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుండటం.. ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని బట్టబయలు చేస్తోందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని అణచివేయడంలో అహోరాత్రులు శ్రమిస్తున్న మోదీని ఉగ్రవాదిగా సంబోధించే ముందు.. ఉగ్రవాదులతో కాంగ్రెస్ నాయకులు చెట్టాపట్టాలేసుకుని తిరిగిన విషయాన్ని మల్లికార్జున్ ఖర్గే గుర్తుపెట్టుకుంటే బాగుండేదని ఎద్దేవా చేశారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో.. కశ్మీర్ వేర్పాటువాద ఉగ్రవాది యాసిన్ మాలిక్‌తో చర్చలు జరిపిన విషయం ఖర్గేకు గుర్తులేదా..? అని ప్రశ్నించారు. ప్రధానిని ఉద్దేశించి మాట్లాడుతున్నప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. రాజకీయాల్లో మరీముఖ్యంగా ఎన్నికల ప్రచారంలో విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమని.. కానీ ఈ ప్రయత్నంలో వ్యక్తిగత దూషణలకు చోటులేదని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలోనూ కావాల్సినంత విషం కక్కారని ఆగ్రహించారు. ఎన్నికల ప్రచారంలో మహిళలు తమను ద్వేషిస్తున్నారని తెలిసి ఆవేదనతో, ఆక్రోషంతో ప్రధానమంత్రి మీద ఇలాంటి విమర్శలు చేయడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## 27న బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు!

**తెలంగాణ భవన్‌లో రజతోత్సవ ముగింపు సభ**

**హాజరుకానున్న పార్టీ అధినేత కేసీఆర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీని బలపరిచే అంశాలపై గులాబీ బాస్ మార్గనిర్దేశర చేయనున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొత్త సమీకరణాలు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. గత ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ తన వ్యూహాన్ని పునర్నిర్మించుకునే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగే ఈ సమావేశం భవిష్యత్తు ఎన్నికల వ్యూహాలు, ప్రజల్లో తిరిగి బలం పెంపొందించుకోవడం, పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయడంపై దృష్టి సారించనుంది. బీఆర్ఎస్ ప్రస్తుతం తన సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి ప్రయత్నిస్తోంది. గ్రామస్థాయి నాయకత్వం నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయం పెంచడం, యువతను ఆకర్షించడం, పాత సభ్యత్వాలను తిరిగి క్రియాశీలం చేయడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు రానునట్లు సమాచారం. ఈ నెల 27వ తేదీన తెలంగాణ భవన్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ ముగింపు సమావేశం పార్టీ భవిష్యత్తు దిశను నిర్ణయించే కీలక ఘట్టమని కేడర్ భావిస్తోంది. కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ద్వారా గులాబీ పార్టీ తన రాజకీయ వ్యూహాలను పునరుద్ధరించుకునే అవకాశం ఉంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సంస్థాగత నిర్మాణంపై గులాబీ కేడర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త కమిటీల ఏర్పాటు, నాయకత్వ బాధ్యతల పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. అలాగే సభ్యత్వాల పునరుద్ధరణ కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలు రూపొందించనున్నట్లు సమాచారం. ఈ సమావేశానికి బీఆర్ఎస్ కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు పాల్గొననున్నారు. ఈ సమావేశం ద్వారా పార్టీ అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కేసీఆర్ సమగ్ర సమీక్ష చేయనున్నారు.

## రెవెన్యూ వ్యవస్థలో సరికొత్త శకం

మొదటి పేజీ తరువాయి

సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన రెవెన్యూ సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని ధీమా వ్యక్తం చేశారు. భూముల రికార్డులను పక్కాగా నిర్వహించేందుకు 'భూభారతి' పోర్టల్‌ను తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. "ఈ పోర్టల్ రైతులకు భద్రత, వారి కుటుంబాలకు నమ్మకం కలిగిస్తుంది. ల్యాండ్, సర్వే, మరియు రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకురావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది. ఇకపై ప్రతి భూమికి ఆధార్ తరహాలోనే ప్రత్యేకమైన 'భూధార్' నంబర్ కేటాయిస్తాం" అని పొంగులేటి వెల్లడించారు. భూ యాజమాన్యంపై ఎటువంటి సందేహాలు లేకుండా ఉండేందుకు, రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్‌ను తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధనను తీసుకువస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. కూసుమంచిలో జరిగిన తొలి రిజిస్ట్రేషన్ ఈ కొత్త విధానానికి నాంది పలికిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేస్తున్నామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన భూసర్వేలు నిర్వహించి, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని స్పష్టం చేశారు. గతంలో సర్వే నంబర్ల విషయంలో ఉన్న గందరగోళం, సరిహద్దు వివాదాలకు ఈ సర్వే మ్యాప్ విధానం చెక్ పెడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రైతు భూమి హక్కులకు పూర్తి స్పష్టతనివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని, పారదర్శకమైన పాలనతో ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేస్తామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





## చర్చలు విఫలం!

**ఆర్టీసీ సమ్మె యథాతథం**

**అర్ధరాత్రి నుంచే నిలిచిపోనున్న బస్సులు**

**నాలుగు వారాల గడువు కోరిన అధికారులు..**

**ససేమిరా అన్న కార్మిక సంఘాలు**


**రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై ప్రభావం..**

**హైదరాబాద్, ఏప్రిల్21:** తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అనివార్యమైంది. తమ డిమాండ్ల సాధన కోసం టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఇచ్చిన సమ్మె పిలుపునకు ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి. మంగళవారం సాయంత్రం ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిపిన చర్చలు విఫలం కావడంతో, ముందస్తు నిర్ణయం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెలోకి వెళ్తున్నట్లు జేఏసీ నాయకులు అధికారికంగా ప్రకటించారు. చర్చల సందర్భంగా ఐఏఎస్ అధికారుల కమిటీ సమస్యల పరిష్కారానికి నాలుగు వారాల సమయం కోరింది. అయితే దీనిని జేఏసీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. "మార్చి 13నే సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. తీరా సమ్మెకు ఒక్కరోజు ముందు చర్చలకు పిలిచి గడువు కోరడం సమంజసం కాదు. ఇప్పటికే ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి, ఇకపై తాత్సారం చేసే ఓపిక కార్మికులకు లేదు" అని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అధికారుల నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ లభించకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మికులు ఐక్యంగా పోరాడాలని జేఏసీ పిలుపునిచ్చింది. "ఎలాంటి బెదిరింపులకు భయపడవద్దు.. అన్ని డిపోల్లో సమ్మెను విజయవంతం చేయాలి" అని కార్మికులను ఉద్దేశించి నాయకులు పేర్కొన్నారు. సమ్మె కారణంగా బుధవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సు సర్వీసులు నిలిచిపోయే అవకాశం ఉంది. దీంతో సాధారణ ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ రవాణా ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, ఆర్టీసీ సేవలు ఆగిపోవడం రవాణా వ్యవస్థపై పెద్ద దెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు.



## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

**నార్వే బృందందతో మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, క్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కండి

**కాంగ్రెస్ కార్యకర్తలకు దామోదర సూచన**



**సంగారెడ్డి, ఏప్రిల్ 21:** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పార్టీ నేతలకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి మంత్రి దామోదర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాయకుల్లో వర్గపోరు ఉంటే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పదవిని అనుభవించాలని మంత్రి అన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలమని.. కార్యకర్తలే ధైర్యం, స్థైర్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలు, విశ్వాసం తక్కువని... అవకాశవాదం ఎక్కువన్నారు. ఎప్పుడూ శత్రువుని తక్కువ అంచనా వేయకూడదని సూచించారు. 70 వేల ఉద్యోగాలను ప్రభుత్వం ఇప్పటికే భర్తీ చేసిందని వెల్లడించారు. ఆరోగ్య శాఖలో ఇంకో 3 నెలల్లో మొత్తం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం పథకం దేశంలో ఎక్కడా లేదని దామోదర రాజనర్సింహ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని అన్నారు. 200 కోట్ల రూపాయల అభివృద్ధి పనులతో సింగూరు ప్రాజెక్ట్‌ను టూరిజం స్పాట్‌గా మారుస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం
- ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా
- 25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 21 :**ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు. ఆర్‌టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. వెయ్యి ఏళ్ళైనా బీఆర్ఎస్ మారదని కవిత వ్యాఖ్యానించారు. గుంటనక్క నిన్న ఢిల్లీ వెళ్లి ఆర్ఎస్ఎస్ పెద్దలను కలిసిందన్నారు. ప్రాజెక్ట్‌ల్లో అవినీతి నుంచి బయటపడేందుకు ఆర్ఎస్ఎస్‌తో చర్చలు జరిపారంటూ కవిత ఆరోపించారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతు న్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు మంగళవారం పాదయాత్రగా బయలుదేరారని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

# న్యాయ పోరాటానికే ఢిల్లీ వెళ్లాను!

- అక్రమ కేసులను ఎదుర్కోవడానికే న్యాయవాదులతో చర్చ
- ఓటుకు నోటు కేసు విచారణపై హరీష్ రావు కీలక వ్యాఖ్యలు
- రేవంత్ రెడ్డి భాష, తీరుపై మండిపాటు



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచన మేరకే తాను ఢిల్లీ వెళ్లి న్యాయవాదులను కలిసినట్లు మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడించారు. ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులను ఎదుర్కోవడానికే ఈ పర్యటన అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కాళేశ్వరం కేసులతో పాటు రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానున్న ఓటుకు నోటు కేసు గురించి కూడా న్యాయ నిపుణులతో చర్చించినట్లు తెలిపారు. ఓటుకు నోటు కేసులో అప్పటి హోంమంత్రి కూడా భాగస్వామిగా ఉన్నారని హరీష్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోం శాఖ తరఫున పేరు లేని న్యాయవాదిని పెట్టారని విమర్శించారు. నిందితుల తరఫున మాత్రం ప్రఖ్యాత న్యాయవాది ముకుల్ రోహత్గీని నియమించుకున్నారని ఆరోపించారు. రేపటి విచారణలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి నిందితుడిగా ఉన్నారని.. గత నాలుగన్నరేళ్లుగా ఆయన స్టేపై ఉన్నారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్ గాంధీతో.. ఉదయం బీజేపీ నేతలతో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. జగిత్యాల సభ ద్వారా కేసీఆర్ బయటకు వచ్చినందుకే ప్రభుత్వం రెండో విడత రైతు భరోసా విడుదల చేసిందని హరీష్ రావు అన్నారు. పంట పెట్టుబడికి ఇవ్వాల్సిన డబ్బును పంట చేతికి వచ్చాక ఇస్తున్నారని దుయ్యబట్టారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ సభకు పోటీగా రేవంత్ రెడ్డి సభ పెట్టడం ఆయన కురచ బుద్ధిని చాటుతోందని విమర్శించారు. సోషల్ మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36 లక్షల మంది లైవ్ లో చూశారని.. రేవంత్ ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని లెక్కలు చెప్పారు. కాంగ్రెస్ అధికారిక సైట్ లో కేవలం 54 మంది మాత్రమే చూశారని ఎద్దేవా చేశారు. "పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు" రేవంత్ రెడ్డి తీరు ఉందని హరీష్ రావు ఎద్దేవా చేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో.. రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ ఎక్కడా రేవంత్ పేరు ఎత్తకుండా హుందాగా మాట్లాడారని.. కానీ రేవంత్ మాత్రం పదేపదే కేసీఆర్ పేరు తలుస్తూ తన భయాన్ని బయటపెట్టుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి హుందాతో మాట్లాడటం నేర్చుకోవాలని.. లేదంటే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లు కూడా రావని హితవు పలికారు. మిగిలిన కాలంలోనైనా ప్రజలకు మంచి పాలన అందించాలని సూచించారు. తన ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదని.. శంషాబాద్ విమానాశ్రయం నుంచే నేరుగా వెళ్లానని హరీష్ రావు స్పష్టం చేశారు.

## ఎందరో ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం

### ఏ ఒక్కరి వల్లనో రాలేదు: కడియం



**జనగామ, ఏప్రిల్ 21:**సకల జనుల పోరాటం, ఎందరో ఆత్మబలిదానాల వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏ ఒక్కరి వల్లనో తెలంగాణ ఏర్పడలేదన్నారు. అయితే దీనిని తానే తెచ్చానని కెసిఆర్ చెప్పుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చిన తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం పాలైందని విమర్శించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కల్వకుంట్ల కుటుంబం మాత్రమే వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుందని ఆరోపించారు. ఇప్పుడు వాళ్లే నీతులు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. 'నేను ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. నిజాయితీగా, నిక్కచ్చిగా ఉన్నాను కాబట్టి రాజకీయాలలో నిలబడగలిగాను' అని ఎమ్మెల్యే వెల్లడించారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉన్నానని.. అందుకే 35 ఏళ్లుగా రాజకీయాలలో కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గతంలో తప్పుడు పనులు చేసి తలవంపులు తీసుకువచ్చిన వారు చాలా మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నియోజకవర్గ ప్రజలు గర్వపడే విధంగానే నా పని తీరు ఉంటుంది' అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు.

## అప్పుడు కేసీఆర్‌కు.. ఇప్పుడు రేవంత్‌కు

### ఏటీఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్


### రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ బండి విమర్శలు



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ.9వేల కోట్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

### రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 21:**తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మేరకు చేయూతను ఇస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్ధలు కొడతానన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉ ందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.



# పదేళ్లు అబద్ధాల పాలన

### బీఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ

### రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష

**నల్గొండ, ఏప్రిల్ 21:** అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్ధాలు చెప్పి మోసం చేయడం కేసీఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్ఛిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. వే-ఎమేప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట

### మోటర్లకు మీటర్లపై మండిపడ్డ ఎంపీ అర్వింద్



**హైదరాబాద్, ఏప్రిల్ 21:**వ్యవసాయ మోటర్లకు కరెంట్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ కేంద్రం నిధులతో చేసినవేనని చెప్పారు. కేసీఆర్.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు చేయలేదు. భూముల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. 72 ఏళ్ల వయసులోనూ కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన హయాంలోనే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆనాటి నుంచి కేసీఆర్ కోవర్టు. ఆయన పేరుకే కాంగ్రెస్.. నిజానికి బీఆర్ఎస్ కార్యకర్త అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్‌లో అక్రమాలను ఉత్తమ్ కొనసాగిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్ అనేది లేనేలేదు. రైతుల వద్ద కరెంట్ బిల్లు వసూలు చేయాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలు అడిగిన మహిళలపై దౌర్జన్యాలు చేయించారు. తెలంగాణలో రైతులను ఆదుకోలేదు కానీ, పంజాబ్‌కు వెళ్లి చెక్కులు ఇచ్చి వచ్చారని అర్వింద్ విమర్శించారు.

## పాలమూరు-రంగారెడ్డిపై అవాస్తవాల ప్రకటన

### 95శాతం ప్రాజెక్టు పూర్తయినట్లు రుజువు చేస్తే రాజీనామా: మంత్రి



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. మంగళవారం మంత్రి మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపిస్తే ఇక్కడి నుంచి వెళ్లి ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాదు రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంకా భ్రమల్లో ఉన్నారని.. ఆయన మాటలకు విశ్వసనీయత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందని మంత్రి తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.



సంపాదకీయం

## ఎండలు మండుతున్నాయి..

# బాధ్యత ఎక్కడ?

తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అసమతుల్యత కారణంగా ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశమున్నట్లు వాతావరణశాఖ ముందుగానే హెచ్చరించింది. అయినప్పటికీ, ప్రతి ఏడాది మాదిరిగానే ఈ హెచ్చరికలు మాటలకే పరిమితమవుతున్నాయి. పాలకుల్లో ముందుచూపు లోపం, సమగ్ర ప్రణాళికల కొరత వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతోంది. ప్రకృతి వనరుల వినియోగంలో నియంత్రణ లేకపోవడం ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. నదుల్లో ఇసుక దోపిడీ, కొండల తవ్వకాలు, అడవుల నరికివేత.. ఇవి అన్నీ కలిపి పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. చెట్ల కొరతతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీడ కూడా అరుదైపోయింది. ఉష్ణోగ్రతలు పెరగడం, భూగర్భ జలాల తగ్గుదల, గాలి కాలుష్యం పెరుగుదల.. అన్నీ కలిపి ప్రజల ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. వ్యవసాయ రంగం ఈ ప్రతికూల పరిణామాలకు మొదటగా బలి అవుతోంది. వర్షాభావం, ఎరువుల కొరత, సాగునీటి సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు ఆశలతో పాటు ఆందోళనలను కూడా తెస్తోంది. విత్తనాలు, ఎరువులు, రుణాల వంటి ప్రాథమిక అవసరాలు సకాలంలో అందకపోవడం వల్ల రైతులు ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెట్టుబడి వ్యయం పెరగడం రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి. కూలీల కొరత కూడా వ్యవసాయానికి పెద్ద సమస్యగా మారింది. జనాభా పెరుగుతున్నప్పటికీ వ్యవసాయ రంగంలో పనిచేయాలనే ఆసక్తి తగ్గుతోంది. యువత ఇతర రంగాలవైపు మళ్లిపోవడంతో చిన్న, మధ్య తరహా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాంత్రీకరణ పెరుగుతున్నప్పటికీ డీజిల్ ఖర్చులు, యంత్రాల నిర్వహణ వ్యయం రైతులపై అదనపు భారం మోపుతున్నాయి.

**ఇక అంతర్జాతీయ పరిస్థితులు కూడా రైతాంగంపై ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం, చమురు ధరల పెరుగుదల, ఎరువుల ముడిసరుకు కొరత వంటి అంశాలు దేశీయ వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయి. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోవడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. ప్రపంచ మార్కెట్‌లో మార్పులు దేశీయ వ్యవసాయాన్ని నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసరంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వాతావరణ హెచ్చరికలను గంభీరంగా పరిగణించి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలి. ప్రాంతాల వారీగా పంటల ఎంపికపై రైతులకు స్పష్టమైన మార్గనిర్దేశనం ఇవ్వాలి. నీటి వినియోగంపై నియంత్రణ, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ వంటి చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలి.**

అలాగే విత్తనాలు, ఎరువులు, రుణాలు సకాలంలో అందేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతులకు తక్కువ వడ్డీ రుణాలు, పంట బీమా, మద్దతు ధరలు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలి. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే దిశగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేవాలి. తాగునీటి సమస్య కూడా రోజురోజుకూ తీవ్రమవుతోంది. పట్టణాలు, గ్రామాల్లో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నీటి సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడం, లీకేజీలను తగ్గించడం, నీటి వృథాను నియంత్రించడం అత్యవసరం. ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంచడం కూడా సమానంగా ముఖ్యమే.

**ప్రకృతి హెచ్చరికలు ప్రతి ఏడాది వస్తూనే ఉంటాయి. కానీ వాటిని గుణపాఠాలుగా తీసుకుని వ్యవస్థను సరిదిద్దడం పాలకుల బాధ్యత. ముందుచూపుతో వ్యవహరిస్తేనే రైతాంగాన్ని కాపాడగలం, భవిష్యత్తు సంక్షోభాలను తగ్గించగలం. లేకపోతే ప్రతి ఏడాది ఇదే సమస్యల పునరావృతం కొనసాగుతూనే ఉంటుంది. ప్రజల సహకారం, ప్రభుత్వ సంకల్పం కలిసివస్తేనే ఈ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుంది.**



# త్రిస్సూర్‌పూరం వేళ పెను విషాదం



- 'బాణసంచా' పేలుడులో 13 మంది దుర్మరణం!
- నిమిషాల వ్యవధిలోనే వల్లకాడైన తయారీ కేంద్రం..
- చెల్లాచెదురైన శరీర భాగాలు
- 33 మందికి తీవ్ర గాయాలు..
- పలువురి పరిస్థితి విషమం..
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

**త్రిస్సూర్/కేరళ:** దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 'త్రిస్సూర్ పూరం' ఉత్సవాలకు నగరం ముస్తాబవుతోంది. ఆకాశంలో రంగురంగుల వెలుగులు నింపే బాణసంచా ప్రదర్శన కోసం కార్మికులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. అయితే, ఆ వెలుగులు నింపాల్సిన చోటే అనూహ్యంగా చీకటి అలుముకుంది. అప్పటివరకు ఉత్సాహంగా పనులు చేసుకుంటున్న ఆ ప్రాంగణం.. కేవలం ఒక్కసారిగా విన్పించిన భీకర శబ్దంతో మరుభూమిగా మారిపోయింది. కంటి రెప్పపాటు కాలంలో జరిగిన పెను ప్రమాదం 13 మంది నిండు ప్రాణాలను బలిగొనడమే కాకుండా, పదుల సంఖ్యలో కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. ముండతికొట్టె సమీపంలోని బాణసంచా తయారీ మరియు నిల్వ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 3:30 గంటల సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. తొలుత ఒక షెడ్డులో మొదలైన పేలుడు, నిమిషాల వ్యవధిలోనే చుట్టుపక్కల ఉన్న ఇతర నిల్వ కేంద్రాలకు వ్యాపించి వరుస పేలుళ్లకు దారితీసింది. పేలుడు ధాటికి కిలోమీటర్ల మేర శబ్దం విన్పించడంతో, స్థానికులు ఒక్కసారిగా భూకంపం వచ్చిందేమోనని భయాందోళనతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గాలిలో దట్టమైన పొగ అలుముకోవడంతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఘటనా స్థలంలో పేలుడు తీవ్రత ఎంతలా ఉందంటే.. కార్మికుల శరీర భాగాలు చెల్లాచెదురుగా పరిసర ప్రాంతాల్లో పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 13 మంది మరణించినట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి. మరో 33 మంది తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీసులు గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. కేరళలో ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్రమైన వేడి (ఎమ్ఘుజవ) కారణంగా రసాయనాలు పేలి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే, నిల్వ కేంద్రాల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదని, భారీ మొత్తంలో బాణసంచా నిల్వ ఉంచడమే ఇంతటి భారీ ప్రాణనష్టానికి కారణమైందని విమర్శలు వస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్‌ను ఆదేశించారు. త్రిస్సూర్ కలెక్టర్ ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు.



# ఇరాన్‌తో చర్చలకు సిద్ధం



- 'శాంతి' దిశగా ట్రంప్ కీలక వ్యాఖ్యలు!
- అభ్యంతరం లేదన్న అగ్రరాజ్య అధినేత..
- బెదిరింపులకు లొంగం: ఇరాన్

**ఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు శాంతి చర్చల ప్రతిపాదన చేశారు. ఇరాన్ నాయకత్వం సంప్రదింపులకు ముందుకు వస్తే, తాను నేరుగా చర్చల్లో పాల్గొనేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని ఆయన స్పష్టం చేశారు. తాజా ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. "వారు కలవాలనుకుంటే మా దగ్గర సమర్థులైన ప్రతినిధులు ఉన్నారు. ఒకవేళ నన్నే కలవాలనుకున్నా నేను సిద్ధమే. శాంతి చర్చల గురించి మాట్లాడటానికి ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంటాయి" అని ప్రకటించారు. ఈ చర్చలు ప్రత్యక్షంగా సాధ్యం కాకపోతే వర్చువల్ విధానంలోనైనా జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య రెండో దఫా శాంతి చర్చలకు పాకిస్థాన్ వేదిక కానుందనే వార్తలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగించబడే అవకాశం ఉందని అమెరికా మాజీ సీఐఏ చీఫ్ డేవిడ్ హెచ్ పెట్రయాస్ కూడా అభిప్రాయపడ్డారు. అయితే, ఈ చర్చలపై ఇరాన్ నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఒకవైపు శాంతి దిశగా అడుగులు పడుతున్నాయన్న ఆశాభావం కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి.

### బెదిరింపులకు లొంగం: ఇరాన్

ట్రంప్ ప్రతిపాదనపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ అత్యంత ఘాటుగా స్పందించారు. అమెరికా తమపై నిరంతరం బెదిరింపులకు పాల్పడుతోందని, అటువంటి వారితో చర్చలకు అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ముఖ్యంగా ఇరాన్ నౌకల రవాణాపై ట్రంప్ ప్రభుత్వం విధించిన దిగ్బంధనం ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆయన మండిపడ్డారు. అమెరికా వైఖరిలో మార్పు రానంత వరకు చర్చలకు తావులేదని ఇరాన్ స్పష్టం చేయడంతో, ఈ ప్రతిపాదన ఎంతవరకు సఫలీకృతమవుతుందనేది వేచి చూడాలి.

# ఉగ్రవాది అని అనలేదు..

- భయపెడుతున్నారని మాత్రమే చెప్పా!
- మోదీపై వ్యాఖ్యలపై మల్లికార్జున ఖర్గే వివరణ



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమరం ముదురుతున్న వేళ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు కొత్త వివాదాన్ని రాజేశాయి. చెన్నైలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో అన్నాడీఎంకే-బీజేపీ పొత్తును విమర్శిస్తూ ప్రధాని మోదీపై ఆయన చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత దూషణల స్థాయికి చేరాయంటూ బీజేపీ మండిపడుతోంది. మోదీకి, బీజేపీకి సమానత్వంపై ఏమాత్రం విశ్వాసం లేదని, అటువంటి వారితో అన్నాడీఎంకే ఎలా చేతులు కలిపిందని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఉద్దేశించి ఖర్గే చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా పరిగణించింది. ఈ అవమానకర వ్యాఖ్యలకు గానూ ఖర్గేతో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఖర్గే స్పందిస్తూ తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. "నేను ప్రధాని మోదీని ఎప్పుడూ ఉగ్రవాది అని అనలేదు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రజలను, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే నా ఉద్దేశం" అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలను తప్పుగా చిత్రీకరించవద్దని కోరారు. తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ కూటమిని మరోసారి గెలిపించాలని కోరుతూ ఖర్గే తన పర్యటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ వైఖరి వల్ల దేశంలోని ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటున్నాయని ఆయన ఆరోపించారు. అయితే, ఖర్గే వివరణను బీజేపీ తిరస్కరిస్తోంది. ప్రధానిని కించపరచడం కాంగ్రెస్ అలవాటుగా మార్చుకుందని, ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ఇలాంటి దిగజారుడు విమర్శలు చేస్తున్నారని బీజేపీ నేతలు ప్రత్యారోపణలు చేస్తున్నారు. ఎన్నికల వేళ ఈ 'మాటల యుద్ధం' ఓటర్లపై ఎటువంటి ప్రభావం చూపుతుందో చూడాలి.

# బీహార్ ఎంపీ 'పడకగది' వ్యాఖ్యల దుమారం

- రాజకీయాల్లో మహిళలపై జుగుప్సాకర విమర్శలు
- బెడ్‌రూమ్ నుంచే మహిళల రాజకీయ ప్రస్థానమంటూ వ్యాఖ్య..
- భగ్గుమన్న మహిళా లోకం.. రంగంలోకి బిహార్ మహిళా కమిషన్..
- ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలని బీజేపీ డిమాండ్



**పాట్నా:** దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్లపై సానుకూల చర్చ జరుగుతున్న తరుణంలో, బిహార్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పప్పూ యాదవ్ అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రాజకీయ వర్గాల్లో అగ్గి రాజేశారు. మహిళల రాజకీయ ఎదుగుదలను కించపరిచే విధంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. 90 శాతం మంది మహిళల రాజకీయ జీవితం నాయకుల 'పడకగది' (బెడ్‌రూమ్) నుంచే ప్రారంభమవుతుందంటూ ఆయన చేసిన అసభ్యకర వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. ఓ సందర్భంలో మాట్లాడిన పప్పూ యాదవ్.. రాజకీయ నాయకులందరూ మహిళలపై కన్నేసి వారిని వేధిస్తున్నారని ఆరోపించారు. అమెరికా నుంచి భారత్ వరకు ప్రతిచోటా ఇదే పరిస్థితి ఉందని, నిత్యం ఎవరో ఒక నాయకుడి వికృత చేష్టలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు బయటపడుతూనే ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. మహిళా సాధికారత గురించి మాట్లాడుతున్న ఈ రోజుల్లో ఒక బాధ్యతాయుతమైన ఎంపీ పదవిలో ఉండి మహిళల క్యారెక్టర్‌ను కించపరిచేలా మాట్లాడటంపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### మహిళా కమిషన్ నోటీసులు

పప్పూ యాదవ్ వ్యాఖ్యలను బిహార్ మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని పేర్కొంటూ ఆయనకు నోటీసులు జారీ చేసింది. దీనిపై తక్షణమే వివరణ ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు బీజేపీ ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించింది. మహిళల పట్ల ఇంతటి హీనమైన ఆలోచనలు ఉన్న వ్యక్తిని పార్లమెంట్ నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసింది.

### సోషల్ మీడియాలో వైరల్:

2024 లోక్‌సభ ఎన్నికల్లో పూర్ణియా నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పప్పూ యాదవ్ వ్యాఖ్యల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. పార్టీలకు అతీతంగా మహిళా నేతలు ఆయన వైఖరిని ఎండగడుతున్నారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని కోరుకుంటున్న తరుణంలో, ఇలాంటి వ్యాఖ్యలు మహిళా లోకాన్ని మానసిక క్షోభకు గురిచేస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# చోరికి గురైన సెల్ ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్పీ

**చురకలు ప్రతినిధి, నిర్మల్, ఏప్రిల్, 21 :** జిల్లా ఎస్పీ. జానకి షర్మిల ఆదేశను-సారంగా, నిర్మల్ పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి జజు×= పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి 100 మెం-బైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని జజు×= ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరి గురైన 100 మొబైల్ ఫోన్లు (పన్నెండు లక్షల రూ-పాయల విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జజు×= వెబ్సైట్లో వినియోగదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందన్నారు. CEIR ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ సిబ్బందిని ఎస్పీ. జానకి షర్మిల అభినందించారు.



# సబ్బుపై 'కొప్పుల' రూపు

## అభిమాన నేతకు యువత వినూత్న కానుక!

## జన్మదిన వేడుకల్లో ఆకర్షణగా నిలిచిన కళాకృతి

## ముగ్ధుడైన మాజీ మంత్రి

## జగిత్యాల బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు

**చురకలు ప్రతినిధి, ఎండపల్లి:** సాధారణంగా అభిమాన నేతల పుట్టినరోజు అంటే భారీ కేకులు, పూలమాలలు, శాలువాలతో సన్మానాలు చూడటం సహజం. కానీ, జగిత్యాల జిల్లాలో జరిగిన ఒక వేడుకలో మాత్రం అందరి దృష్టిని ఆకర్షించిన ఒక వినూత్న బహుమతి చర్చనీయాంశంగా మారింది. ఆ కానుకను చూడగానే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సైతం ఆశ్చర్యంతో ముగ్ధుడైపోయారు. చేతిలో ఇమిడిపోయే ఒక చిన్న వస్తువుపై ఆయన రూపం ప్రాణం పోసుకోవడమే ఈ సస్పెన్స్ వెనుక ఉన్న అసలు విషయం.

### సబ్బుపై అద్భుత శిల్పం

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదినం సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ యువ నాయకులు ఆయనపై తమకున్న ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. కప్పరావుపేటకు చెందిన యువ నాయకుడు బత్తిని భరత్, అత్యంత నైపుణ్యంతో ఒక సబ్బుపై కొప్పుల ఈశ్వర్ ప్రతిమను ఆకృతిగా చెక్కించి దానిని మాజీ మంత్రికి కానుకగా అందజేశారు. సూక్ష్మ కళాఖండంగా కనిపిస్తున్న ఈ సబ్బు శిల్పం సోమవారం జగిత్యాల బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### ఆదర్శం ఆయన సేవలు

ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ.. కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి, ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని కొనియాడారు. "యువతలో ఆయనపై ఉన్న ఆదరాభిమానాలను చాటేందుకే ఈ వినూత్న ప్రయత్నం చేశాం" అని బత్తిని భరత్ పేర్కొన్నారు. అనంతరం నాయకులు కొప్పుల ఈశ్వర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గ నాయకులు దేవి నళిని కాంత్, తరాల్ల కార్తీక్ తదితరులు పాల్గొని సందడి చేశారు.



# విశిష్టాద్వైత మతోద్ధారకుడు రామానుజుడు

## వైశాఖ శుక్ల షష్టి రామానుజాచార్యుల జయంతి

**(ఈద మధుకర్, సీనియర్ జర్నలిస్ట్)**

రాజాదరణ పొంది ప్రాబల్యాన్ని సంతరించుకున్న జైన, బౌద్ధ, శైవ మతాలు స్థానిక ఆచార వ్యవహారాలలో కలసి, అనేకానేక శాఖలుగా విభజితాలై, వేర్వేరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ తమ శాఖలు గొప్పవని నొక్కి చెబుతూ, మూల ఉపనిషత్తుల సారాన్ని ప్రజలకు చేరువ చేయజాలని సమయాన, విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించి ఉద్ధరించారు శ్రీ రామానుజాచార్యులు. త్రిమతాచార్యులలో, ద్వితీయులైనా, కర్తవ్య నిర్వహణలో అద్వితీయులు. అసమాన ధైర్యాన్ని ప్రదర్శించి, సాటిలేని భక్తి తత్పరు నిగా తత్వవేత్తగా, ఆస్తిక హేతువాదిగా, పరమ యోగిగా, శంకర భగవత్పాదుల అద్వైత సిద్ధాంతం లోని దోషాలను సరిదిద్ది, నాటికి ప్రబల ప్రచారంలో ఉన్న సంప్రదాయాలన్నీ, దేవుడిని కొలవడానికి భిన్న మార్గాలే కాని, వైదిక మతానికి బదులుగా పాటించాల్సినవి కానే కాదని నొక్కి చెప్పిన ధీశాలి ఆయన. రామానుజులు జన్మించేనాటికి చోళులు, శైవ మతానుయాయులు అయినప్పటికీ, వైదిక మతాలను వ్యతిరేకించ లేదు. చాళుక్యులు శైవ మతస్తులు అయి ఉండి, తర్వాత జైన మతాన్ని ఆలపించారు. హొయసల రాజులు, జైన, వీరశైవ మతాలను ఆదరించారు. మౌర్యుల కాలానికి బౌద్ధం క్షీణ దశకు చేరుకుంది. మద్రాసుకు 30 మైళ్ళ దూరాన గల, శ్రీపెరుంబుదూరులో, హరిత గోత్రోద్భవులు, ఆపస్తంభ సూత్ర, యజుర్వేద శాఖాధ్యాయులు, శ్రీమాన్ అసూరి సర్వ క్రతు కేశవ సోమయాజి దీక్షితార్ మరియు కాంతిమతి దంపతులకు కలియుగ సంవత్సరం 4118 క్రీస్తు శకం1017 వైశాఖ శుక్ల పక్ష షష్టి గురువారం జనన మొందారు. కేశవ తన కుమారునికి, ప్రాథమిక విద్య స్వయంగా నేర్పగా, అనంతరం కాంచీపురానికి వెళ్లి యాదవ ప్రకాశుల వద్ద వేదాంతం అభ్యసించి, మూలానికి వ్యాఖ్యానం చేయడంలో గురు - శిష్యులకు భేదాభిప్రాయాలు కలువగా తమ విశిష్టాద్వైతాన్ని నెగ్గించుకున్నారు రామానుజులు. దీనితో గురువు కాశీకి కలసి తమతో పయనమైన, శిష్యుడిని చంపించే




కుట్ర చేయగా, అది తెలుసుకుని, తప్పించుకొని కంచికి చేరారు. శ్రీరంగంలోని వైష్ణవ గురువైన అలవందారు, రామానుజుని ప్రతిభ గురించి విని శిష్యుడైన, పెరియ నంబిని పంపగా, వెనువెంటనే ఆయన పయనమయ్యారు. రామానుజుడు, శ్రీరంగం చేరే సమయానికి, ఆలవందారు తుది శ్వాస వదిలారు. భౌతిక దేహ వేళ్లలో, 3 విచిత్రంగా ముడుచుకొని ఉండడాన్ని గమనించారు. ఆయన మూడు కోరికలు తీరకుండా ఉండిపోయారని, అలవండారు శిష్యుల ద్వారా విని, మూడు కోరికలు అయిన, బ్రహ్మసూత్రాలకు, సహస్ర నామాలకు, తరువాయి మొళికి వ్యాఖ్యానాలు రాస్తామని, వాగ్దానం చేయడంతో మూడు వేళ్ళు తెరుచుకున్నాయని చెబుతారు. తర్వాత మధురాంతకంలో పెరియ నంబికి శిష్యులుగా మారారు. విద్యాభ్యాస సమయాన, తన భార్య గయ్యాలి తనం కారణంగా, గురువు శ్రీరంగం వెళ్లనందుకు నొచ్చుకున్న రామానుజులు, సంసార బంధం వీడి, సన్యాసాశ్రమం స్వీకరించారు. తిరు కోటి యార్ నంబి ప్రఖ్యాతి విని, తనను శిష్యునిగా స్వీకరించమని, ఆరు మార్లు ప్రాధేయ పడినా, ఫలితం లేక పోగా, ఏడవ సారి చేర బిలిచి, మంత్ర రహస్యం ఎవరికీ చెప్ప కూడదని వాగ్దానాన్ని పొంది, ఉపదేశం చేశారు. మోక్ష సంపాదనకు ఆ మంత్ర శక్తి సాధనం లేదని భావించి, ఒక వైష్ణవాలయం గోపురం ఎక్కి, గురువుకు చేసిన ప్రమాణాన్ని పక్కన పెట్టి, ఉపదే దేశిత మంత్రాన్ని, బహిరంగంగా ఎలుగెత్తి ప్రకటించారు. గురువు కోపంతో నరకానికి వెళతావు అని అన్నప్పుడు, జన సమూహానికి మోక్షం లభిస్తే, తాను ఒక్కడు నరకానికి వెళ్ళడానికి సిద్ధమని బదులు ఇచ్చారాయన. శిష్యుని ఉన్నత ఆదర్శానికీ, సంతోషించి, గురువు ఆశీర్వదించారు. అద్వైత వేదాంతి యగు, యజ్ఞమూర్తితో, శ్రీరంగంలో 16 రోజులు వాదించి, ఓడించగా, ఆయన శైవం పుచ్చుకున్నారు. బ్రహ్మసూత్రాలకు భాష్యం, వేదాంత సారం, వేదాంత దీపం, వేదాంత దీపిక, వేదార్థ సంగ్రహం శ్రీరంగ గద్యం, వైకుంఠ గద్యం, మొదలైన రచనలు చేశారు. తిరుపతి దేవస్థానంలో పూజాదికాలపై, తగాదా రాగా రామానుజులు మధ్యవర్తిగా ఉండి, వైష్ణవ ప్రాబల్యానికి కట్టుదిట్టం చేశారు. చేసిన వాగ్దానం ప్రకారం బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానాలు రాయగా, పరాశర బట్టు చేత సహస్ర నామాలకు, తమ చుట్టమైన తిరుక్కురెప్పిరన్ చేత తిరువాయి మొలి మీద వ్యాఖ్యానాలు రాయించారు. కావేరీ తీర సాలిగ్రామం అనే చోట 12ఏళ్లు నివసించి, జైనులను ఓడించి, బిత్తి దేవుని వైష్ణవునిగా మార్చారు. చాత్తాద శ్రీవైష్ణవులు అమ్మంగార్ల కైంకర్యం చేసే సంప్రదాయాలను ఏర్పరిచారు. మేల్కోటలో, రామ ప్రియ అనే విగ్రహాన్ని తెప్పించి, ప్రతిష్టింపజేసి, రథోత్సవం నాడు ఆలయంలో పంచములకు ప్రవేశం కల్పించారు. శ్రీరంగంలో మత ప్రచారానికి 74 మంది శిష్యులను నియమించారు. వ్యాస సూత్ర భాష్యం గీతా భాష్యం, తర్క భాష్యం తదితరాలు రాయడం చేత "భాష్యకారుడు" అని త్రిదండి కావడం వల్ల "యతి రాజు" అని, "ఎంబరు మానారు" అని, లబ్ద ప్రతిష్టులు అయినారు. రామానుజులు ఆనాటి ఆచార వ్యవహారాలు, చాందసంగా మారి, సామాజిక ప్రగతికి అడ్డు రాకముందే, గుర్తించి వాటిని, మానడమో, మార్చడమో చేయాలని కర్తవ్య నిర్దేశం చేశారు. గురువు చెప్పేదంతా గుడ్డిగా నమ్మక తర్కానికి గురిచేసి, తప్పో, ఒప్పో నిర్ణయించు కోవడం పాపం కాదని, హితవు పలికారు. సమాజ శ్రేయస్సు కన్నా, వ్యక్తిగత శ్రేయస్సు ముఖ్యం కాదని రామానుజులు నొక్కి చెప్పారు.

# సమ్మె, సంక్షోభం, సంస్కరణలు..

# ఆర్టీసీ భవిష్యత్తు ఎటు?



**భారతదేశ సామాజిక ముఖచిత్రంలో ప్రజా రవాణా వ్యవస్థ అక్షరాలా కోట్లాది మంది సామాన్యుల జీవన గమనానికి వెన్నెముక వంటిది. ముఖ్యంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు కేవలం రవాణా సాధనాలు మాత్రమే కావు, అవి గ్రామీణ భారతాన్ని పట్టణ ప్రగతితో అనుసంధానించే జీవనాడులు. నిరుపేదలు, విద్యార్థులు, కార్మికులు, చిన్న వ్యాపారులు తమ దైనందిన అవసరాల కోసం ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడతారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రతిష్ఠాత్మక సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, పరిపాలనా పరమైన వైఫల్యాలు, ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వెరసి కార్మిక సమ్మెలకు దారితీస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె అనేది కేవలం వేతనాల పెంపు కోసం జరిగే పోరాటం మాత్రమే కాదు, అది ప్రజా రవాణా వ్యవస్థ మనుగడ కోసం, సామాన్యుడి ప్రయాణ హక్కు కోసం ఉద్భవించిన ఒక పెను సామాజిక-ఆర్థిక ఉద్యమంగా పరిగణించాల్సి ఉంటుంది.**

స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో 1950వ దశకంలో ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ సంస్థలు ఆవిర్భవించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి తెలంగాణ, నవ్యాంధ్ర వరకు ఆర్టీసీ సేవలు అజరామరమైనవి. నాడు లాభసాటిగా సాగిన ఈ ప్రయాణం క్రమంగా నష్టాల బాట పట్టడానికి ప్రధాన కారణం పెరిగిన ఇంధన ధరలు మరియు ప్రభుత్వాల పన్నుల విధానం. డీజిల్ ధరలు లీటరుకు 100 రూపాయలకు పైగా చేరుకుంటున్నా, సామాన్యుడిపై భారం పడకూడదనే ఉద్దేశంతో టికెట్ ధరలను వలసిన విధంగా పెంచక పోవడం సంస్థకు భారంగా మారింది. దీనికి తోడు ప్రైవేట్ వాహనాల అక్రమ రవాణా వల్ల సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఆర్టీసీ నిర్వహణలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ఉచిత పాస్‌లు సంస్థ ఆర్థిక సంక్షోభానికి మరో ప్రధాన కారణం. ఉదాహరణకు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యార్థులు, దివ్యాంగులు, జర్నలిస్టులు, వృద్ధులకు ఇచ్చే రాయితీల భారం ఏటా వందల కోట్లలో ఉంటుంది. ఈ రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సకాలంలో రీయంబర్స్ చేయక పోవడం వల్ల సంస్థ అప్పుల ఊబిలో కూరుకు పోతోంది. గణాంకాల ప్రకారం, ఒక్క తెలంగాణ ఆర్టీసీపైనే గతంలో



సుమారు 5,000 కోట్ల రూపాయలకు పైగా అప్పులు ఉండగా, నెలవారీ నష్టం 50 నుండి 80 కోట్ల రూపాయల వరకు నమోదవుతూ వచ్చింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సుమారు 48,000 నుండి 50,000 మంది ఉద్యోగులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లు కేవలం వాహనాలను నడపడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు బాధ్యత వహిస్తున్నారు. అయితే పని ఒత్తిడి, విశ్రాంతి లేకపోవడం, సరైన వైద్య సౌకర్యాలు అందకపోవడం వంటి అంశాలు వారిని మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయి. 2019లో తెలంగాణలో జరిగిన చారిత్రాత్మక ఆర్టీసీ సమ్మె ఈ సమస్యల తీవ్రతకు నిలువుటద్దం. 52 రోజుల పాటు సాగిన ఆ సమ్మెలో దాదాపు 50,000 మంది కార్మికులు తమ హక్కుల కోసం వీరోచితంగా పోరాడారు. ఆ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి, దీనివల్ల రోజుకు 10 నుండి 15 కోట్ల రూపాయల ఆదాయం సంస్థ కోల్పోయింది.

సంస్థను నష్టాల నుంచి గట్టెక్కించడానికి కేవలం సమ్మెలు పరిష్కారం కావు, ప్రభుత్వం మరియు యజమాన్యం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఆర్టీసీని ఒక వ్యాపార సంస్థగా కాకుండా సామాజిక సేవా సంస్థగా చూడాలి. ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రత్యేక నిధులు కేటాయించడమే కాకుండా, పన్ను రాయితీలు కల్పించాలి. డీజిల్‌పై వాట్ (వ్యాట్) తగ్గించడం ద్వారా ఏటా వందల కోట్ల రూపాయల వ్యయాన్ని ఆదా చేయవచ్చు. అలాగే పెరుగుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. ప్రస్తుతం టికెట్ ఆదాయం కాకుండా ఇతర మార్గాల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఇందులో భాగంగానే తెలంగాణ ఆర్టీసీ ప్రారంభించిన 'కార్గో మరియు పార్శిల్' సేవలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. రోజుకు సుమారు 50 నుండి 70 లక్షల రూపాయల వరకు అదనపు ఆదాయం ఈ సేవల ద్వారా సమకూరుతోంది.

**ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం మరొక కీలక సంస్కరణ. కిలో మీటరుకు డీజిల్ బస్సుతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సు నిర్వహణ ఖర్చు 30% నుండి 40% వరకు తక్కువగా ఉంటుంది. పర్యావరణ హితంగా ఉండటమే కాకుండా ఇంధన భారాన్ని ఇది గణనీయంగా తగ్గిస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ వంటి నగరాల్లో వందలాది ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడం శుభపరిణామం. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను చేపట్టింది. ఇది కార్మికుల దశాబ్దాల కాలపు కల. దీనివల్ల సుమారు 43,000 మందికి పైగా కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొంది, ఉద్యోగ భద్రత మరియు సరైన వేతన సవరణ పొందే అవకాశం ఏర్పడింది.**

అయితే, సంస్థ స్వయం ప్రతిపత్తిని కాపాడుతూనే ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం సవాలుతో కూడుకున్న పని. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెట్టడం, ప్రయాణికుల కోసం మొబైల్ యాప్‌ల ద్వారా లైవ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు సంస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతాయి. కార్మికులతో యజమాన్యం నిరంతరం చర్చలు జరుపుతూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా ఒక పటిష్టమైన గ్రీవెన్స్ మెకానిజంను ఏర్పాటు చేయాలి. అప్పుడే సమ్మెల వంటి తీవ్ర నిర్ణయాలకు తావుండదు. ప్రజల అవసరాలు, కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ ఆర్థిక స్థిరత్వం ఈ మూడింటి మధ్య సమతుల్యత దెబ్బతిన్నప్పుడే సంక్షోభాలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు, ఆధునిక సంస్కరణలు మరియు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తేనే ఆర్టీసీ మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుంది. భావి తరాలకు భరోసా ఇచ్చేలా, సామాన్యుడి ముంగిట ఎర్ర బస్సు నిరంతరం పరుగులు తీయాలంటే సంకల్పం మరియు సమష్టి కృషి అనివార్యం. సమ్మెలు తాత్కాలిక సెగను రేపవచ్చు, కానీ చర్చలు మరియు సంస్కరణలు మాత్రమే శాశ్వత వెలుగును నింపుతాయి. ఆర్టీసీ మనుగడ అనేది కేవలం ఒక ఆర్థిక అంశం కాదు, అది లక్షలాది కుటుంబాల జీవనోపాధి మరియు కోట్ల మంది సామాన్యుల కనీస రవాణా హక్కు. వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు కాకుండా, ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఆధునీకరించడం ద్వారా మాత్రమే సుస్థిరమైన పురోగతి సాధ్యమవుతుంది.

**ప్రస్తుత తరుణంలో ఏప్రిల్ 22 నుండి కార్మికులు చేపడుతామని చెపుతున్న సమ్మెను నివారించాలంటే ప్రభుత్వం కార్మికుల సాధ్యాసాధ్యమైన కోర్కెలను సానుకూలంగా పరిశీలించాల్సి ఉంది. ఆర్టీసీని కాపాడుకోవడం అంటే సామాన్యుడి ప్రయాణాన్ని కాపాడుకోవడమే. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా సంస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దడం పాలకుల ప్రాథమిక బాధ్యత. బస్సు చక్రం ఆగిపోతే అభివృద్ధి కుంటుపడుతుంది, అదే చక్రం ప్రగతి పథంలో సాగితే సమాజం అంతా సుభిక్షంగా ఉంటుంది.**

అందుకే ఆర్టీసీ భవిష్యత్తు అనేది కేవలం సంస్కరణలపైనే కాక, ప్రభుత్వ చిత్తశుద్ధి మరియు కార్మికుల అంకితభావంపై ఆధారపడి ఉంది. సమగ్ర ప్రణాళికలతో సంస్థను బలోపేతం చేసి, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఆర్టీసీని మళ్ళీ అగ్రగామిగా నిలబెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. పారిశ్రామిక శాంతి నెలకొన్నప్పుడే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయి, సంస్థ కూడా లాభాల బాట పడుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# విద్యాకుసుమాలు - క్రమశిక్షణ ముళ్లు



పాఠశాలలు కేవలం పాఠ్యాంశాల బోధనకు మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిత్వ నిర్మాణానికి, సామాజిక బాధ్యతాభావం పెంపొందించడానికి కీలక కేంద్రాలుగా భావించబడుతున్నాయి. ఈ సందర్భంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ అనే అంశం ఎప్పటికీ ప్రాముఖ్యత కోల్పోని మూల్యంగా నిలిచింది. అయితే క్రమశిక్షణ పేరుతో ఉపాధ్యాయులు తీసుకునే చర్యలు ఎంతవరకు చట్టబద్ధం, ఎంతవరకు నైతికంగా సమర్థించదగినవి అన్నది కాలక్రమేణా పెద్ద చర్చా విషయంగా మారింది. తాజాగా కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ చర్చకు మరో కొత్త మలుపు నిచ్చింది. విద్యార్థిని క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయుడు బెత్తంతో కొట్టిన ఘటనలో నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ కోర్టు చేసిన వ్యాఖ్యలు విద్యా రంగం, న్యాయ వ్యవస్థ, మానవ హక్కుల వర్గాల్లో విస్తృత చర్చకు దారితీశాయి.

## మారుతున్న కాలం.. మారుతున్న చట్టాలు

### గురు శిష్య బంధం: క్రమశిక్షణకు, హక్కులకు మధ్య సమతుల్యత ఏది?

**(ఈద మధుకర్, సీనియర్ జర్నలిస్ట్)**

**తిరువనంత పురంలోని ఒక పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనలో విద్యార్థి అశ్రద్ధగా ప్రవర్తించాడనే కారణంతో ఉపాధ్యాయుడు స్టాఫ్ రూమ్‌లో బెత్తంతో కొట్టాడని ఆరోపణలు వచ్చాయి. దీనిపై పోలీసులు భారతీయ న్యాయ సంహిత (దీచీ) మరియు జువైనల్ జస్టిస్ చట్టాల కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్లు సాధారణంగా పిల్లలపై హింస, వేధింపుల కేసుల్లో ఉపయోగించబడే కఠినమైన నిబంధనలు. అయితే ఈ కేసులో ఉపాధ్యాయుడు తన చర్య క్రమశిక్షణ కోసమే జరిగిందని, దానిలో ఎటువంటి క్రూర ఉద్దేశం లేదని వాదిస్తూ హైకోర్టును ఆశ్రయించాడు.**

కేసును విచారించిన ధర్మాసనం కొన్ని కీలక అంశాలను పరిశీలించింది. మొదటగా, విద్యార్థికి తలెత్తిన గాయాల తీవ్రత. మెడికల్ రిపోర్టుల ప్రకారం విద్యార్థి శరీరంపై ఎటువంటి గంభీర గాయాలు లేవని తేలింది. ఇది కేసు తీవ్రతను తగ్గించే ప్రధాన అంశంగా కోర్టు పరిగణించింది. రెండవది, ఘటన జరిగిన వెంటనే కాకుండా కొన్ని రోజుల తర్వాత ఆసుపత్రికి వెళ్లడం. దీనిని కోర్టు అనుమానాస్పదంగా భావించింది. మూడవది, ఉపయోగించిన సాధనం---'బెత్తం'. చట్టపరంగా ఇది ప్రమాదకరమైన ఆయుధం కాదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ అంశాలన్నింటినీ సమీక్షించిన తరువాత కోర్టు 'మెన్స్ రియా' అనే న్యాయ సూత్రాన్ని ప్రస్తావించింది. అంటే నేరం జరగాలంటే కేవలం చర్య మాత్రమే కాకుండా దాని వెనుక నేరపూరిత ఉద్దేశం కూడా ఉండాలి. ఈ కేసులో ఉపాధ్యాయుడి చర్య క్రమశిక్షణ పరిరక్షణ కోసమే జరిగిందని, దానిలో క్రూరత్వం లేదా ద్వేషభావం కనిపించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. అందువల్ల ఈ చర్యను నేరంగా పరిగణించడం సబబు కాదని పేర్కొంది.

**ఈ తీర్పు ద్వారా కోర్టు మరో ముఖ్యమైన అంశాన్ని స్పష్టం చేసింది. ఉపాధ్యాయులకు విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు కొంత పరిమిత అధికారాన్ని చట్టం అనుమతిస్తుందని పేర్కొంది. అయితే ఈ అధికారం అపరిమితం కాదు. అది సదుద్దేశంతో, సమంజసమైన పరిమితుల్లో, క్రూరత్వం లేకుండా వినియోగించబడాలి. ఈ సూత్రం ద్వారా కోర్టు ఒక సున్నితమైన సమతుల్యతను సూచించింది-విద్యార్థుల హక్కులను కాపాడుతూ ఉపాధ్యాయుల పాత్రను పరిరక్షించడం.**

ఇక్కడ ఒక విస్తృత సామాజిక నేపథ్యాన్ని పరిశీలించడం అవసరం. భారతదేశంలో శారీరక శిక్ష (corporal punishment) పై చట్టపరమైన దృక్కోణం గత కొన్ని దశాబ్దాల్లో గణనీయంగా మారింది. ఒకప్పుడు "బెత్తం బుద్ధి చెబుతుంది" అనే భావన సాధారణంగా అంగీకరించబడేది. కానీ పిల్లల హక్కులపై అవగాహన పెరగడంతో ఈ దృక్కోణం మారింది. 2009లో అమలులోకి వచ్చిన విద్యా హక్కు చట్టం (Right to Education Act) ప్రకారం పాఠశాలల్లో శారీరక శిక్షను నిషేధించారు. అలాగే జువైనల్ జస్టిస్ చట్టం కూడా పిల్లలపై హింసను కఠినంగా శిక్షిస్తుంది.

నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (NCPCR) నివేదికల ప్రకారం భారతదేశంలో ఇంకా అనేక పాఠశాలల్లో శారీరక శిక్ష కొనసాగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థుల్లో సుమారు 60 శాతం వరకు ఎప్పుడో ఒకసారి శారీరక శిక్షను అనుభవించినట్లు వెల్లడైంది. ఇది చట్టం ఉన్నప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయని చూపిస్తుంది.

ఈ నేపథ్యంలో కేరళ హైకోర్టు తీర్పు ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతోంది-శారీరక శిక్షను పూర్తిగా నిషేధించిన చట్టాల నేపథ్యంలో "పరిమిత శారీరక చర్య"కు స్థానం ఉందా? కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా శారీరక శిక్షకు మద్దతు ఇవ్వలేదు. కానీ ప్రతి సందర్భాన్ని దాని ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా పరిశీలించాలని సూచించింది. ఇది ఒక రకంగా 'సందర్భానుసార న్యాయం' (ఎశీత్‌వఞ్‌ఋశ్రీ యబర్‌అఎవ) భావనకు దగ్గరగా ఉంటుంది.

ఇంకొక కోణంలో చూస్తే, ఈ తీర్పు ఉపాధ్యాయులపై పెరుగుతున్న చట్టపరమైన ఒత్తిడిని కూడా ప్రతిబింబిస్తుంది. గతంలో క్రమశిక్షణ పేరుతో తీసుకున్న చర్యల వల్ల అనేక ఉపాధ్యాయులు కేసుల్లో ఇరుక్కుపోయిన సందర్భాలు ఉన్నాయి. దీని వల్ల పాఠశాలల్లో క్రమశిక్షణ అమలు చేయడంలో ఉపాధ్యాయులు వెనకడుగు వేస్తున్నారని విద్యా నిపుణులు అంటున్నారు. కేరళ హైకోర్టు తీర్పు ఈ భయాన్ని కొంతవరకు తగ్గించే ప్రయత్నంగా కూడా చూడవచ్చు.

అయితే ఈ తీర్పుపై విమర్శలు కూడా లేకపోలేదు. పిల్లల హక్కుల కోసం పోరాడే సంస్థలు ఈ నిర్ణయం ప్రమాదకర సందేశాన్ని పంపవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. "సదుద్దేశం" అనే పదం సబ్జెక్టివ్‌గా ఉండటం వల్ల దాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. ఒక ఉపాధ్యాయుడు తన చర్యను సదుద్దేశంతో చేశానని చెప్పడం ద్వారా శారీరక శిక్షను సమర్థించుకునే పరిస్థితి రావచ్చని విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక సమగ్ర దృక్కోణం అవసరం. విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడం అనివార్యం. కానీ దానికి ఉపయోగించే పద్ధతులు సమకాలీన విలువల కు అనుగుణంగా ఉండాలి. సైకాలజీ పరిశోధనలు చూపిస్తున్నట్లుగా, శారీరక శిక్ష తాత్కాలికంగా ప్రవర్తనను నియంత్రించగలిగినా దీర్ఘకాలంలో భయం, ఆత్మవిశ్వాస హీనత, ఆగ్రహం వంటి ప్రతికూల ప్రభావాలు కలిగిస్తుం ది. అందువల్ల సానుకూల క్రమశిక్షణ (జూశీంఱ్‌ఱఙవ ఎఱంఎఱ-జూశ్రీఱఅవ), ప్రవర్తనా మార్పు పద్ధతులు, కౌన్సెలింగ్ వంటి మార్గాలు ఎక్కువగా ప్రోత్సహించ బడుతున్నాయి.

**కేరళ హైకోర్టు తీర్పు ఒక చట్టపరమైన స్పష్టతను అందించినప్పటికీ, ఇది విద్యా వ్యవస్థలో ఉన్న విభిన్న సవాళ్లను కూడా వెలుగులోకి తీసుకొచ్చింది. క్రమశిక్షణ మరియు మానవ హక్కుల మధ్య సమతుల్యత ఎలా సాధించాలి అన్న ప్రశ్నకు ఇది తుది సమాధానం కాదు, కానీ ఒక దిశను సూచించే ప్రయత్నం మాత్రమే. భవిష్య త్తులో ఈ అంశంపై మరింత స్పష్టమైన మార్గదర్శకాలు, ఉపాధ్యాయులకు శిక్షణ, పాఠశాల స్థాయిలో నియంత్రణ వ్యవస్థలు అవసరం అవుతాయి. అంతిమంగా విద్య అంటే కేవలం నియంత్రణ కాదు, మార్గనిర్దేశం. శిక్ష అంటే భయం కాదు, అవగాహన. ఈ విలువలను ప్రతిబింబించే విధంగా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకున్నప్పుడే సమాజం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందుతుంది.**

# విశ్వవైద్య యవనికపై తెలుగు వెలుగు

## డాక్టర్ నాగేశ్వర రెడ్డికి అంతర్జాతీయ గౌరవం

### పద్మభూషణ్ డాక్టర్ నాగేశ్వర రెడ్డి అరుదైన రికార్డు

ప్రపంచ వైద్య యవనికపై భారతీయ మేధస్సు మరోసారి సగర్వంగా మెరిసింది. వైద్యశాస్త్రంలో అత్యంత క్లిష్టమైన గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో దశాబ్దాలుగా నిరుపమాన సేవలు అందిస్తూ, నూతన ఆవిష్కరణలకు చిరునామాగా నిలిచిన పద్మభూషణ్ డాక్టర్ డి. నాగేశ్వర రెడ్డి తాజాగా అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ అండ్ బయోలాజికల్ ఇంజనీరింగ్ (ూ×వీదీజు) కాలేజ్ ఆఫ్ ఫెలోస్‌కు ఎంపిక కావడం కేవలం ఒక వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, అది భారతీయ వైద్య పరిశోధనా పటిమకు అంతర్జాతీయ సమాజం అర్పించిన నీరాజనం. ప్రపంచ వ్యాప్తంగా వైద్య, జీవ వైజ్ఞానిక ఇంజనీరింగ్ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన అగ్రశ్రేణి మేధావుల్లో కేవలం రెండు శాతం మందికి మాత్రమే దక్కే ఈ గౌరవం, డాక్టర్ నాగేశ్వర రెడ్డి కృషిలోని లోతును, ఆయన ఆవిష్కరణల వెనుక ఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని ప్రపంచానికి చాటి చెబుతోంది. ఈ ఎంపిక ద్వారా నోబెల్ బహుమతి గ్రహీతలు, అత్యున్నత శాస్త్రవేత్తలు కొలువుదీరిన వేదికపై ఒక తెలుగు వైద్యుడికి స్థానం దక్కడం యావత్ దేశానికి గర్వకారణం.

డాక్టర్ నాగేశ్వర రెడ్డి ప్రస్థానం గమనిస్తే, ఆయన గ్యాస్ట్రో ఎంటరాలజీ రంగాన్ని కేవలం ఒక చికిత్సా విభాగంగా కాకుండా, సాంకేతికతను మేళవించిన ఒక ఆధునిక ఇంజనీరింగ్ అద్భుతంగా తీర్చిదిద్దారు. గతంలో ఎండోస్కోపీ అంటే కేవలం శరీర అంతర్భాగాలను పరిశీలించి వ్యాధిని నిర్ధారించే ఒక ప్రాథమిక సాధనంగా మాత్రమే పరిగణించ బడేది. కానీ, డాక్టర్ రెడ్డి తన సుదీర్ఘ పరిశోధనలతో ఎండోస్కోపీని ఒక శక్తివంతమైన శస్త్రచికిత్సా ప్రత్యామ్నాయంగా మార్చి వేశారు. శస్త్రచికిత్స అంటేనే భయపడే రోగులకు, కోత లేకుండా, రక్తస్రావం కాకుండా, అతి తక్కువ సమయంలోనే క్లిష్టమైన సమస్యల నుండి విముక్తి కలిగించే 'థెరప్యూటిక్ ఎండోస్కోపీ' విధానాన్ని ఆయన ప్రాచుర్యంలోకి తెచ్చారు. ముఖ్యంగా గ్యాస్ట్రో ఇంటెస్టినల్ మార్గంలో తలెత్తే అడ్డంకులను తొలగించడానికి ఆయన రూపకల్పన చేసిన 'నాగి స్టెంట్' (చీూస్ర్రఱ ూ్‌వఅ్‌) వైద్య చరిత్రలో ఒక విప్లవాత్మక ఆవిష్కరణ. పాంక్రియాటిక్ ఫ్లూయిడ్ కలెక్షన్ల వంటి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఈ స్టెంట్ వినియోగం రోగుల ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఒక భారతీయ వైద్యుడి పేరుతో పిలవబడే ఈ పరికరం నేడు ప్రపంచ వ్యాప్తంగా వందలాది దేశాల్లో వినియోగంలో ఉండటం మన స్వదేశీ పరిశోధనా సామర్థ్యానికి నిలువెత్తు సాక్ష్యం. ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (ూ×+) స్థాపన ద్వారా డాక్టర్ నాగేశ్వర రెడ్డి హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ గ్యాస్ట్రో ఎంటరాలజీ రాజధానిగా మార్చారు. గచ్చిబౌలిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమైన ఈ వైద్యాలయం కేవలం రోగులకు చికిత్స అందించే కేంద్రమే కాదు, అది ఒక విజ్ఞాన గని. ప్రతి ఏటా ప్రపంచం నలుమూలల నుండి వందలాది మంది వైద్యులు ఇక్కడికి వచ్చి అత్యాధునిక ఎండోస్కోపీ మెళకువలను నేర్చుకుంటారు. క్లినికల్ ప్రాక్టీస్, అకడమిక్ రీసెర్చ్ మరియు టెక్నాలజీ డెవలప్‌మెంట్ అనే మూడు అంశాలను అనుసంధానించడంలో ఆయన చూపిన చొరవ అద్వితీయం. ఏఐజీ ఆసుపత్రి నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ఎండోస్కోపీ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందడం వెనుక డాక్టర్ రెడ్డి దార్శనికత, నిరంతర శ్రమ దాగి ఉన్నాయి. వైద్యుడు కేవలం రోగిని పరీక్షించే వ్యక్తిగా మాత్రమే మిగిలి పోకూడదని, సమాజానికి అవసరమైన నూతన పద్ధతులను కనుగొనే పరిశోధకుడిగా మారాలని ఆయన నిరూపించారు.

**వైద్య రంగంలో వస్తున్న మార్పులను ఆయన ఎప్పటికప్పుడు అందిపుచ్చు కుంటున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధస్సు (ూతీ్‌ఱఫఱషఱaశ్రీ ×అ్‌వశ్రీశ్రీఱ-స్త్రవఅషవ) ప్రభావం పెరుగుతున్న తరుణంలో, గ్యాస్ట్రో ఎంటరాలజీలో కూడా ఏఐ సాంకేతికతను అనుసంధానించడంలో ఆయన ముందు వరుసలో ఉన్నారు. కంప్యూటర్ విజన్ ద్వారా రోగ నిర్ధారణలో మానవ తప్పిదాలను తగ్గించడం, ఎండోస్కోపీ స్క్రీనింగ్‌లో సూక్ష్మమైన పాలిప్స్ లేదా క్యాన్సర్ కణాలను గుర్తించడంలో ఏఐ వినియోగాన్ని ఆయన ప్రోత్సహిస్తున్నారు. ఇంజనీరింగ్ సూత్రాలను వైద్య శాస్త్రానికి అన్వయించడం ద్వారానే వైద్యం మరింత సరళం, చౌక అవుతుందని ఆయన బలంగా విశ్వసిస్తారు. అందుకే ఆయనకు దక్కిన ఏఐఎంబీఈ ఫెలోషిప్, వైద్యులు మరియు ఇంజనీర్ల మధ్య ఉండాల్సిన సహకారానికి ఒక వారధి వంటిది. కేవలం విదేశీ యంత్రాలపై ఆధార పడకుండా, స్థానిక అవసరాలకు అనుగుణంగా మన దేశంలోనే వైద్య పరికరాలను తయారు చేయాలనే ఆయన ఆకాంక్ష 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఉంది.**

భారతదేశంలో మారుతున్న జీవనశైలి కారణంగా కాలేయ సంబంధిత వ్యాధులు, పాంక్రియాటిక్ సమస్యలు, ఉదర కోశ క్యాన్సర్లు వేగంగా విస్తరిస్తున్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ఖరీదైన శస్త్రచికిత్సలు అందరికీ అందుబాటులో ఉండవు. అటువంటి తరుణంలో డాక్టర్ నాగేశ్వర రెడ్డి ప్రవేశపెట్టిన 'మినిమల్లీ ఇన్వేసివ్' పద్ధతులు సామాన్యులకు సైతం నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేశాయి. ఆయన చేసిన కృషిని గుర్తించి భారత ప్రభుత్వం 2002లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ పురస్కారాలతో గౌరవించింది. అలాగే అమెరికన్ సొసైటీ ఫర్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోస్కోపీ (ూూ+జు) నుండి అత్యున్నత పురస్కారాలను అందుకున్న తొలి భారతీయుడిగా ఆయన రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఏఐఎంబీఈ గౌరవం ఆయన కీర్తి కిరీటంలో మరో కలికితురాయి.



డాక్టర్ నాగేశ్వర రెడ్డి కేవలం ఒక నిపుణుడు మాత్రమే కాదు, ఆయన ఒక గొప్ప మానవతావాది కూడా. వైద్యం అనేది వ్యాపారం కాకూడదని, అది సామాజిక బాధ్యత కావాలని ఆయన ఎప్పుడూ చెబుతుంటారు. ఏఐజీ ద్వారా అనేక ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించడం ఆయన దాతృత్వానికి నిదర్శనం. యువ వైద్యులకు ఆయన ఇచ్చే సలహా ఒక్కటే---సృజనాత్మకతను వదులుకోవద్దు. పుస్తకాల్లో ఉన్నది చదవడం మాత్రమే కాకుండా, రోగి ఎదుర్కొంటున్న ఇబ్బందికి కొత్త పరిష్కారం ఏమిటా అని ఆలోచించడమే అసలైన వైద్యం అని ఆయన బోధిస్తారు. ఆయన శిష్యులు నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ ఆసుపత్రుల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తుండటం ఆయన సంపాదించిన అసలైన సంపద. ఏఐఎంబీఈ వేదికపై డాక్టర్ రెడ్డి సభ్యత్వం వల్ల భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో విధాన రూపకల్పనలో భాగస్వామ్యం లభిస్తుంది. గ్లోబల్ హెల్త్ పాలసీలు, బయోమెడికల్ స్టాండర్డ్స్ నిర్ణయించే క్రమంలో భారతీయ అవసరాలను, ఇక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రపంచానికి వివరించే అవకాశం కలుగుతుంది. ఇది భవిష్యత్తులో మన దేశంలో వైద్య పరిశోధనలకు అంతర్జాతీయ నిధులు, సాంకేతిక సహకారం అందడానికి మార్గం సుగమం చేస్తుంది. వైద్యం మరియు ఇంజనీరింగ్ రంగాల కలయికతోనే రాబోయే కాలంలో జబ్బులను సమూలంగా నిర్మూలించగలమని డాక్టర్ రెడ్డి నిరూపిస్తున్నారు.

**డాక్టర్ డి. నాగేశ్వర రెడ్డి సాధించిన ఈ ఘనత ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం. ఒక మధ్యతరగతి నేపథ్యం నుండి వచ్చి, తన మేధస్సుతో, అంకితభావంతో అంతర్జాతీయ వైద్య రంగాన్ని శాసించే స్థాయికి ఎదగడం సామాన్యమైన విషయం కాదు. ఆయన కృషి వల్ల నేడు భారతదేశం ఎండోస్కోపీ రంగంలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తోంది. విదేశీయులు మన దేశానికి వచ్చి వైద్యం నేర్చుకునే స్థాయికి మన ప్రమాణాలను పెంచిన ఘనత ఆయనది. డాక్టర్ నాగేశ్వర రెడ్డి వంటి దార్శనికులు ఉన్నంత కాలం భారత వైద్య రంగం వెలుగులీనుతూనే ఉంటుంది. ఈ అంతర్జాతీయ గుర్తింపు యువ పరిశోధకుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, మరిన్ని స్వదేశీ ఆవిష్కరణలు రూపుదిద్దు కుంటాయని ఆశిద్దాం. ప్రపంచ ఆరోగ్య పటంలో భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టిన డాక్టర్ నాగేశ్వర రెడ్డి ప్రస్థానం అజరామరం, అనుసరణీయం. ఒక గొప్ప వైద్యుడిగా, దార్శనికుడిగా, మార్గదర్శిగా ఆయన సేవలు భావి తరాలకు ఎప్పటికీ దిక్సూచిగా నిలుస్తాయి.**

**రామ కిష్టయ్య సంగన భట్ల**
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

చురకలు



# జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫకృద్దీన్ తనయుడు ఎండి శంశొద్దీన్ తన జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకున్నారు. సోమవారం గ్రామంలోని వృద్ధుల శరణాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శంశొద్దీన్ మాట్లాడుతూ సమాజంలో వృద్ధులను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కాగా వృద్ధులు శంశొద్దీన్ ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఇంటి పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

## రైతులకు కూరగాయల విత్తనాల మినీ కిట్ల పంపిణీ



**తాండూర్:** ఇంటి పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని ఉద్యాన విస్తరణ అధికారిణి శ్వేత రాణి అన్నారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాల మినీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాసాడి తిరుపతి చేతుల మీదుగా రైతులకు ఐదు రకాల కూరగాయల విత్తనాల కిట్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పంటల సాగును అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ మినీ కిట్లను ఉచితంగా అందజేస్తోందన్నారు. ప్రతి కిట్లో ఐదు రకాల నాణ్యమైన విత్తనాలు ఉన్నాయని తెలిపారు. కూరగాయల సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతుల్లో పంటలు పండించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

# మర్లపాడులో ఆంధ్ర సీఎం జన్మదిన వేడుకలు




**సత్తుపల్లి:** వేంసూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పరస్పరం తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుడని కొనియాడారు. ఆయనకు దీర్ఘాయుశ్శు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి మురళిధర్ రెడ్డి, తోట పుల్లారావు, గ్రామ శాఖ నాయకుడు శివ నాగ సూరి, మందపాటి బాబు రెడ్డి, ఆంజనేయులు, కొణిజర్ల రాంబాబు, శ్రీను, కృష్ణ, సదాశివరావు, దారా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలంలోని మర్లపాడు గ్రామంలో మంగళవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు ప్రారంభించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రత్యేక చొరవతో ఈ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దీంతో స్థానిక రైతులు తమ పంటను సులభంగా విక్రయించే అవకాశం లభించిందని పేర్కొన్నారు. మద్దతు ధర రూ.2400తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ ఆధ్వర్యంలో పంటను అమ్ముకునే విధంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రం ప్రారంభం పట్ల గ్రామంలోని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వచ్చిందని, ఇప్పుడు సరైన మద్దతు ధర లభిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం ద్వారా రైతులకు ఆర్థికంగా ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే మట్టా రాగామయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ కు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలా ఉండగా వెన్న చోటు వెంకటాపురంలో కూడా మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంసూర్ మండల తహశీల్దార్ మాణిక్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, వెల్ది జగన్ మోహన్ రావు, గణపతి రెడ్డి, రంగారెడ్డి, మందపాటి రాఘవరెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, గొర్ల సంజీవ రెడ్డి, సర్పంచ్ ఫక్రుద్దీన్, అఫీషియల్ పిఐసి విశ్వజిత్, ఏఈఓ ఎస్ సందీప్ ఇంచార్జి రాంపుల్లయ్య, సెక్రెటరీ సూర్యప్రకాశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పోడు సమస్యతో రైతుల జీవన విధానంపై తీవ్ర ప్రభావం

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**కాగజ్ నగర్:** పోడు భూముల సమస్యలు రైతుల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కాగజ్నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్ లో రైతుల పోడు భూముల సమస్యల పరిష్కారానికి మంగళవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. తమ పోడు భూముల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గత 50 ఏళ్లుగా ఈ భూములను సాగు చేస్తున్నామని, మాకు ఉన్నది ఈ భూమి ఒక్కటేనని, మాకు వేరే ఉపాధి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేము బ్రతికినా, చనిపోయినా ఈ భూమితోనే, ఈ భూమిలోనే ఉంటామని అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు. ఎదురవుతున్న ఇబ్బందులను తెలియజేసి, తక్షణ పరిష్కారం కోసం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల హక్కులను కాపాడేందుకు తమ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**నేరడిగొండ(ఇచ్చోడ):** అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాథోడ్ రమేష్, ఉప సర్పంచ్ షబ్బీర్ కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా కలెక్టర్ ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. పథకం అమలు తీరుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి ఎద్దడి, రైతుల సౌకర్యార్థం పొలంబాట రోడ్ల నిర్మాణ అవశ్యకతను వివరించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ గ్రామంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు లబ్ధిదారులు లత–సంతోష్, సంగీత–రాజుల గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చౌహాన్ రాందాస్, గ్రామస్తులు పాల్గొన్నారు

# జొన్న రైతులను ఆదుకోవాలి

## మంత్రి జూపల్లికి పసుల చంటి విన్నపం



**ఆదిలాబాద్:** జిల్లాలో తెల్ల జొన్నల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు దిగుబడులు కూడా అధికంగా రావడంతో రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి కోరారు. మంగళవారం జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాద్లో కలిసి జిల్లాలోని జొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పసుల చంటి మాట్లాడుతూ ఈ ఏడాది జొన్న పంట అంచనాలకు మించి పండడంతో రైతులు మార్కెటింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి ఎకరానికి కనీసం 20 క్వింటాళ్ల చొప్పున జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అలాగే రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వెంటనే జిల్లా కలెక్టర్తో మాట్లాడి కొనుగోలు కేంద్రాల పెంపుపై తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే ఎకరానికి 20 క్వింటాళ్ల కొనుగోలు అంశాన్ని రాష్ట్ర వ్యవసాయ, ఆర్థిక శాఖ మంత్రులతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, గత ఏడాది కంటే అధికంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే జిల్లాలోని జొన్న రైతులకు పెద్ద ఎత్తున మేలు జరుగుతుందని పసుల చంటి ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి





## జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**రడిగొండ(ఇచ్చోడ):** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. మంగళవారం అధికారులతో కలిసి నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల్లోని పలు వరద నీటి నిల్వ ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ముందుగా నేరడిగొండ మండలంలోని కిష్టాపూర్ వేబ్రిడ్జిని పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మార్పులు చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న కాలువ నిర్మాణాన్ని పరిశీలించి, గత వర్షాకాలంలో ఇక్కడ భారీగా వరద నీరు చేరిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులతో చర్చించారు. తదుపరి గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్ గ్రామ పరిధిలో గల ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్ను తనిఖీ చేశారు. హాస్టల్ ఆవరణలోకి వర్షపు నీరు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రధాన డ్రైనేజీ వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకోవడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డీపీఓ రమేష్, డీఎల్పీఓ ఫణిందర్, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, ట్రైబల్ ఈఈ తానాజీ, జిల్లా ఎస్సీ అభివృద్ధి సంక్షేమ అధికారి సునీత, తహశీల్దార్లు కలీమ్, ఇమ్రాన్ ఖాన్, కవిత, ఎంపీడీఓలు రవీందర్, శేఖర్, జాతీయ రహదారి విభాగం ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల:** ప్రజాపాలన ద్వారా ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, డీసీసీ ప్రతినిధి రఘునాథ్ రెడ్డిలతో కలిసి అర్జీదారుల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు. రహదారులు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలను ప్రజలు తెలియజేస్తే అధికారుల సమన్వయంతో వాటిని త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా 75లక్షల మంది రైతులకు రూ.6వేల కోట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటోందని, రైతు సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణ సదుపాయాలు కల్పించి వివిధ వ్యాపార రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తోందని తెలిపారు. అనంతరం అమృత్ భారత్ పథకంలో భాగంగా మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో రూ.25కోట్లు మంజూరై పనులు కొనసాగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రైల్వే శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం కల్పించాలి

**ఎంపీడీఓ శ్రీనివాస్**



**తాండూర్:** పని ప్రదేశాల్లో ఉపాధిహామీ కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తరచూ నీళ్లు తాగుతూ, ఎండ ఎక్కువగా అనిపిస్తే కొంతసేపు విశ్రాంతి తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సర్పంచ్, సెక్రటరీలతో గ్రామ అభివృద్ధిపై చర్చించారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సర్పంచ్లు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు సరైన భోజనం అందించాలని చెప్పారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. వారికి సమయానికి పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్, పంచాయతీ సెక్రటరీ లక్ష్మణ్, వార్డు సభ్యులు ఉన్నారు.

# పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

, **మంచిర్యాల:** బాలసదనం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాల సదనం నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ.1కోటి 34లక్షల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనం భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మంచిర్యాల పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని సందర్శించి ఆర్డీఓ శ్రీనివాస్ రావుతో కలిసి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63,163జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

**జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**మంచిర్యాల:** రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నమ్నూర్ డివిజన్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలక్ట్రానిక్ కాంటాలు, తేమ కొలిచే యంత్రాలు, గోనె సంచులు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో దళారుల కారణంగా రైతులు పంట కొనుగోలులో నష్టపోయారని, ప్రస్తుతం ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ధాన్యం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. స్థానిక రైతులు మరొక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరగా, సంబంధిత మార్కెటింగ్ అధికారులతో చర్చించి త్వరలోనే అదనపు కేంద్రం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పథక సంచాలకులు డి.సుభాష్, వ్యవసాయ అధికారి రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ముని, డివిజన్ కార్పొరేటర్లు లగిశెట్టి రాజయ్య, రాచమల్ల కమల, టీఎంసీ చంద్రయ్య, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, ఏరియా లెవెల్ ఫెడరేషన్ ప్రతినిధి సామల మల్లీశ్వరి, మహిళా సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి





**హత్నూర:** గ్రామాలను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతిఒక్కరు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హత్నూర గ్రామపంచాయతీ కార్యాలయంలో బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ముఖ్యంగా బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్థులు కృషి చేయాలని సూచించారు. పాక్సో చట్టం ద్వారా బాలలపై జరిగే లైంగిక నేరాలకు కఠినమైన శిక్షలు ఉంటాయని వివరించారు. డొమెస్టిక్ వైలెన్స్ చట్టం ద్వారా కుటుంబాల్లో మహిళలు ఎదుర్కొనే హింసకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. సోషల్ మీడియా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ వేధింపులు, ఆన్లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఎలాంటి అన్యాయం జరిగినా మహిళలు భయపడకుండా చట్టపరమైన సహాయం పొందాలని, వృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, నాయకులు చెక్క రవీందర్ గౌడ్, పందుగ రవికుమార్, నల్లోల్ల పెంటయ్య, వార్డు సభ్యుడు నాగేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా గృహప్రవేశ మహోత్సవం

**బోథ్:** మండలంలోని సాయినగర్ గ్రామంలో ఆత్రం ముకుంద్ రావ్ నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, ఆదివాసీ ముద్దుబిడ్డ కుంరం సత్యవతి కోటేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముకుంద్ రావ్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసీ బిడ్డలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆత్మీయత, అనురాగాల మధ్య ఇలాంటి శుభకార్యాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, బోథ్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఆత్రం గంగారాం, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటాం



**బోథ్:** కష్ట కాలంలో కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ బోథ్నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త జాదవ్ సుభాష్ ఇటీవల మృతి చెందగా మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని కలిసి సుభాష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, తక్షణ సాయంగా తనవంతుగా రూ.5వేల నగదును అందజేశారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, బొందిడి సర్పంచ్ రాథోడ్ సునీత మధుకర్, మాజీ ఎంపీటీసీ చాట్ల ఉమేష్, నాయకులు బొజ్జ సాయన్న, జాదవ్ ఉమేష్, అచ్యుతానంద రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఎండి సద్దాం, మౌలానా, విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

## సప్తాహకు రావాలని డీసీసీ అధ్యక్షుడికి ఆహ్వానం



, **జైనథ్:** మండలంలోని కరంజి గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న బాజీరావు బాబా సప్తాహ కార్యక్రమానికి హాజరుకావాలని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ను నాయకులు ఆహ్వానించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు ఎల్టీ జగదీష్ రెడ్డి, బిక్కి గంగన్న కార్యక్రమ వివరాలను తెలియజేస్తూ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరారు. వారి వెంట బోథ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, డీసీసీ జనరల్ సెక్రటరీ మల్యాల కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు తొడసం దౌలత్ రావు, బండారి సతీష్ తదితరులు ఉన్నారు

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



**సత్తుపల్లి:** విధుల్లో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని కేంద్రాలను స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి (డీడబ్ల్యుఓ) విజేత అన్నారు. సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం సెక్టార్ లో గల అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడి కోడిగుడ్డు పెడుతున్నారా.. ఆటలు ఆడిస్తున్నారా అని అడగగా, పెడుతున్నారని చిన్నారులు సమాధానం ఇచ్చారు. కేంద్రాల్లో ఉన్న చిన్నారుల బరువును తూకం వేసి పరిశీలించారు. లబ్ధిదారులను అందిస్తున్న పౌష్టికాహారం వివరాలపై ఆరా తీశారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలను సూపర్ వైజర్ లకు, సీడీపీఓలకు నెలవారి మామూళ్లు ఇస్తున్నారా అని ప్రశ్నించగా, లాంటిదేమి లేదని టీచర్స్, హెల్పర్స్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడైనా టీచర్స్, ఆయాలు విధుల్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చురకలు



## ఆకాశవాణి తొలి స్వరకర్త

# బాలాంత్రపు రజనీ కాంతరావు

### నేడు బాలాంత్రపు రజనీ కాంతరావు వర్ధంతి



**బాలాంత్రపు రజనీ కాంతరావు** సుప్రసిద్ధ వాగ్గేయకారునిగా, స్వరకర్తగా, గీత రచయితగా, విజయవాడలోని ఆకాశవాణి సంచాలకులుగా రేడియో శ్రోతలకు చిరపరిచితులు. అయన తొలితరం సంగీత దర్శకుల్లో ఒకరు. ఆయన రచించిన వాగ్గేయకార చరిత్ర 20వ శతాబ్దంలో తెలుగులో వచ్చిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. 1947 లో దేశం స్వాతంత్ర్యం పొందిన అర్ధరాత్రి భారత ప్రధాని సుప్రసిద్ధ ప్రసంగం పూర్తవగానే రజనీ రచించి, స్వరపరచిన 'మాదీ స్వతంత్రదేశం, మాదీ స్వతంత్ర జాతి' టంగుటూరి సూర్యకుమారి గానం ఆసేతుహిమాచలం ప్రతిధ్వనించింది.

**తొలి స్వాంత్ర్య దినోత్సవం రోజున స్వయంగా రచించి స్వరపర్చిన "జయభేరి, వాయించు నగారా గీతం" మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారమయ్యాయి.**

ఆ తర్వాత అర్థశతాబ్దం పైగా ఆయన తెలుగునాట లలిత సంగీతమనే ఒక నూతన గాన సంప్రదాయాన్ని సృష్టించి, పెంపొందించి, తానొక వాగ్గేయ కారుడిగా అవతరించడమే కాక, మరెందరో వాగ్గేయకారులకు మార్గదర్శకులుగా ఉన్నారు.

1920 జనవరి 29న పశ్చిమ గోదావరి జిల్లా నిడదోలులో రజనీకాంత రావు జన్మించారు. ఆయన తండ్రి బాలాంత్రపు వేంకటరావు ప్రసిద్ధి చెందిన వేంకట పార్వతీశ కవుల్లో ఒకరు కావడం విశేషం. 1940-41 ప్రాంతంలో ఇరవయ్యేళ్ల నాడు ఆల్ ఇండియా రేడియో సంస్థలో ఉద్యోగంలో చేరగా, నాటి నుండి రిటైరయ్యే వరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లోని కేంద్రాల్లో పనిచేసి 1978లో రేడియో స్టేషన్ డైరెక్టరుగా రిటైరయ్యారు.

**ఆకాశవాణిలో తొలి స్వరకర్తగా శ్రోతలను అలరించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చిన వారిలో రజనీకాంతరావు కీలకమైన వారు. అలాగే తొలితరం సంగీత దర్శకుల్లోనూ బాలాంత్రపు కూడా ఒకరు.**

రజనీ" అని పిలుచుకునే బాలాంత్రపు రజనీ కాంతరావు ఒక వ్యక్తి కాదు, ఆయన ఏదో ఒక కళకే పరిమితం కాదు. ఆయన ఒక రచయిత, వాగ్గేయ కారుడు, రేడియో కళాకారుడు, సినీ పాటల - మాటల రచయిత, సంగీత దర్శకుడు. సంగీతంలో , సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలో రజనీది ఒక ప్రత్యేక శైలి. సాధారణత్వం - సంక్లిష్టత, ప్రాచీనత - ఆధునికత, అచ్చ తెలుగు మాటలు - సంస్కృత భూయిష్ట సమాసాలు, అనేక పరస్పర విరుద్ధ విషయాలు అయన కవిత్వంలో పదబంధాల్లో చోటు చేసుకున్నాయి.

ప్రయోగాలు - సంగీత రూపకాలు, యక్షగానాలు, నాటికలు, సంగీత శిక్షణ, ఉషశ్రీ గారి ధర్మ సందేహాలు, ఈ మాసపు పాట, బావగారి కబుర్లు, ఇంకా ఎన్నో కార్యక్రమాల రూపకర్త ఆయన. వీటికి సంబంధించిన రచనలు చేయడం, బాణీలు సమకూర్చడం ఒక ఎత్తు, వాటిని గాయనీ గాయకులతో, వాద్య బృందంతో నిర్వహించడం మరొక ఎత్తు, రేడియో కోసం రచయిత గుడిపాటి వెంకటాచలంను అయన చేసిన ఇంటర్వ్యూ ఈ నాటికి కూడా అపురూపమైనదిగా పరిగణిస్తారు. ఆలిండియా రేడియో లలిత సంగీత విభాగాన్ని తన ప్రతిభతో సుసంపన్నం చేశారు. రజనీ రచించి, స్వరపరిచిన అనేక కృతులు తెలుగు వారి సాంస్కృతిక, సంగీత రంగాల్లో నిలిచి పోయాయి. ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ తన సంగీతంలో లిరిసిజం రజనీ ప్రభావమేనన్నారు. లలిత సంగీతానికి, తెలుగు సాహిత్యానికి మధ్య సంబంధాన్ని నెలకొల్పి, దానికి రూపకల్పన చేసిన గొప్ప సంగీత కారులుగా ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరి రాజేశ్వరరావులతో పాటు రజనీకాంతరావు తెలుగు సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు.

ఠాగూర్ అకాడమీ రత్న - రవీంద్రనాథ్ ఠాగూర్ 150 జయంతి సందర్భంగా సంగీత నాటక అకాడమీ ప్రదానం, కళాప్రపూర్ణ - ఆంధ్ర విశ్వ విద్యాలయం 1981 లో బహుకరించిన గౌరవ డాక్టరేట్, కళారత్న అవార్డు - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007 లో ఇచ్చిన పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం - 1961. ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర ఉత్తమ పరిశోధనా గ్రంథానికి, ప్రతిభా మూర్తి జీవితకాల సాఫల్య బహుమతి - అమెరికాలోని అప్పజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి పురస్కారం, నాథ సుధార్ణవ - మదరాసు మురళీరవళి ఆర్ట్ అకాడమీ, పుంభావ సరస్వతి, నవీన వాగ్గేయకార, 2008లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారాలు ఆయనకు లభించాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, రజనీకాంతరావు 2018, ఏప్రిల్ 22 ఆదివారం రోజున మరణించాడు



# ముచ్చింతల్ క్షేత్రంలో గుబాళిస్తున్న ఆధ్యాత్మిక పరిమళాలు

### నానాటికీ అధికమవుతున్న భక్తుల సందర్శనలు


ముచ్చింతల్‌లో పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి చొరవతో 216 అడుగుల ఎత్తయిన రామానుజాచార్యుల విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగి నాలుగేళ్లు దాటింది. ఈ విగ్రహాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ 5 ఫిబ్రవరి 2022న వసంత పంచమి పర్వదినం సందర్భంగా ఆవిష్కరించి జాతికి అంకితం ఇచ్చారు. గత నాలుగేళ్లుగా అనుదినం దేశ విదేశాల నుండి పర్యాటకులు, సందర్శకులు, యాత్రికులు, భక్తులు నానాటికీ పెరిగిపోతూ, కొత్త అనుభూతులను వెంట తీసుకెళ్ళు తున్నారు.

రాజా ఆదరణ పొంది ప్రాబల్యాన్ని సంతరించుకున్న జైన, - బౌద్ధ, శైవ మతాలు స్థానిక ఆచార వ్యవహారాలలో కలసి, అనేకానేక శాఖలుగా విభజితాలై, వేర్వేరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తూ తమ శాఖలు - గొప్ప వని నొక్కి చెబుతూ, మూల ఉపనిషత్తుల సారాన్ని ప్రజలకు చేరువ చేయజాలని సమయాన, విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించి ఉద్ధరించారు శ్రీ రామానుజా చార్యులు. త్రిమతాచార్యులలో, ద్వితీయులైనా, కర్తవ్య నిర్వహణలో అద్వితీయులు. అసమాన ధైర్యాన్ని ప్రదర్శించి, - సాటిలేని భక్తి తత్పరునిగా తత్వవేత్తగా, ఆస్తిక హేతువాదిగా, పరమ యోగిగా, నాటికి ప్రబల ప్రచారంలో ఉన్న సంప్రదాయాలన్నీ, దేవుడిని కొలవడానికి భిన్న మార్గాలే కాని, వైదిక మతానికి బదులుగా పాటించాల్సినవి కానే కాదని నొక్కి చెప్పిన ధీశాలి ఆయన. రామానుజులు జన్మించే నాటికి చోళులు, శైవ మతానుయాయులు అయినప్పటికీ, వైదిక మతాలను వ్యతిరేకించ లేదు. చాళుక్యులు శైవ మతస్తులు అయి ఉండి, తర్వాత జైన మతాన్ని ఆలపించారు. హట్నయసల రాజులు, జైన, వీరశైవ మతాలను ఆదరించారు. మౌర్యుల కాలానికి బౌద్ధం క్షీణ దశకు చేరుకుంది. మద్రాసుకు 30 మైళ్ళ దూరాన గల, శ్రీపెరుంబుదూరులో, హరిత గోత్రోద్భవులు, ఆపస్తంభ సూత్ర, యజుర్వేద శాఖాధ్యాయులు, శ్రీమాన్ అసూరి సర్వక్రతు కేశవ సోమయాజి దీక్షితార్, కాంతిమతి దంపతులకు కలియుగ సంవత్సరం 4118 క్రీస్తు శకం 1017 వైశాఖ శుక్ల పక్ష షష్టి గురువారం జనన మొందారు రామానుజులు.

రామానుజులు ఆనాటి ఆచార వ్యవహారాలు, చాందసంగా మారి, సామాజిక ప్రగతికి అడ్డు రాకముందే, గుర్తించి వాటిని, మానడమో, మార్చడమో చేయాలని కర్తవ్య నిర్దేశం చేశారు. గురువు చెప్పేదంతా గుడ్డిగా నమ్మక తర్కానికి గురిచేసి, తప్పో, ఒప్పో నిర్ణయించు కోవడం పాపం కాదని, హితవు పలికారు. సమాజ శ్రేయస్సు కన్నా, వ్యక్తిగత శ్రేయస్సు ముఖ్యం కాదని రామానుజులు నొక్కి చెప్పారు.



రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ లో 45 ఎకరాల విస్తీర్ణంలో పరమ హంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి సత్ సంకల్పంతో దివ్య క్షేత్ర పనులు 2016లో ప్రారంభ మయ్యాయి. 45 ఎకరాల విస్తీర్ణంలో రూ.1000 కోట్లతో పనులు జరిగాయి. పల్లవ, చోళ, చాళుక్య, కాకతీయ, విజయనగర నిర్మాణ శైలులను కలగలిపి వివిధ 2700 మంది శిల్పుల భాగస్వామ్యంతో నిర్మాణాలు చేపట్టగా, ప్రధానంగా.. సమతామూర్తి 216 అడుగుల, 1800 కిలోల బరువు గల మహా పంచలోహ విగ్రహాన్ని 1600 భాగాలుగా తొమ్మిది నెలల కఠోర శ్రమ తో చైనాలో తయారు చేయించారు. మన దేశానికి తెచ్చాక చైనాకు చెందిన 60 మంది నిపుణులు విగ్రహ రూపునిచ్చారు. వెయ్యేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. సమతామూర్తి మహా విగ్రహం చుట్టూ శ్రీవైష్ణవంలో దివ్యదేశాలుగా భావించే 108 పుణ్య క్షేత్రాలు, గర్భాలయాల ఆకృతిలో 108 ఆలయాలను నిర్మించారు. వీటిని అనుసంధానిస్తూ మధ్యలో 468 స్తంభాలతో భారీ దివ్యదేశ మండపాన్ని నిర్మించారు. సమతామూర్తి విగ్రహ దిగువ న భద్రవేదిక 54 అడుగులు, పద్మ పీఠం 27 అడుగులు,




శ్రీరామాను జాచార్యుల విగ్రహం 108 అడుగులు, స్వామి చేతిలోని త్రిదండం 27 అడుగుల ఎత్తు ఉన్నాయి. మహా విగ్రహం కింద విశాలంగా ఉన్న గర్భగుడిలో 120 కిలోల బంగారు విగ్రహ రూపంలో రామానుజులు నిత్యపూజామూర్తిగా దర్శనం ఇస్తారు. అలా వెయ్యేళ్ల క్రితం భారతావనిలో నడయాడిన సమతా మూర్తి జగద్గురు శ్రీరామానుజాచార్యులు భక్తులకు నిత్య దర్శనం ఇస్తున్నారు.

2022 ఫిబ్రవరి 5వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన చేతుల మీదుగా ఈ సమతా మూర్తి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం నాలుగేళ్లు దాటాయి. రామానుజులవారి బ్రహ్మోత్సవాలు సమతా కుంభ్ 2023 పేరుతో ఆధ్యాత్మిక పండగను 10 రోజుల పాటు నిర్వహించారు. సమతా కుంభ్ 2023 సువర్ణమూర్తి భగవద్రామానుజుల వారికి స్నపనం మహోత్సవంతో, శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజియర్ స్వామి ఆధ్వర్యంలో విశ్వక్సేనుడి ఆరాధనాతో ప్రారంభమై, ఫిబ్రవరి 12న చివరి రోజు ఉదయం ఉత్సవాన్త స్నపనము, సాయంత్రం మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ తో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో సమతాకుంభ్ 2024 ద్వితీయ బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక గురువు త్రిదండి శ్రీశ్రీశ్రీ రామానుజ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా జరిగాయి. అశేష భక్త జనం కార్యక్రమాలలో పాల్గొని తరించారు. గత నాలుగేళ్లుగా అనుదినం



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494





# రవివర్మ చిత్రాలకు ప్రేరణ అంజనీబాయి మాల్పేకర్

## నేడు అంజనీబాయి జయంతి

"రవి వర్మకే అందని ఒకే ఒక అందానివో", "రవి చూడని పాడని నవ్య నాదానివో" అంటూ "రావణుడే రాముడైతే" చిత్రం (1980) కోసం, వేటూరి సుందర రామమూర్తి కలం నుండి జాలువారి, బాలు - జానకి గళాల నుండి అలవోకగా, సుమధురంగా గానం చేయబడిన పాట, సంగీత ప్రియులకు సుపరిచితమే. చిత్రకళకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తెచ్చిన చిత్రకారుడు రాజా రవివర్మ. హైందవ సంస్కృతిలో అంతర్భాగమైన రామాయణ, మహాభారత ఆది పురాణాలలో ఘట్టాలను, చిత్రాలుగా మలిచి, గుర్తింపు పొందారు రాజా రవివర్మ.

**ఆయన తన చిత్రాలను, దక్షిణ భారత స్త్రీల లాగా ఊహించి, అందంగా చిత్రించే వాడు. ముఖ్యంగా మహాభారతంలోని నల దమయంతుల, శకుంతల దుష్యంతుల కథలలోని ఘట్టాలను, చిత్రాలుగా చిత్రించి ఎంతో పేరు సంపాదించారు. భారతీయుల ఊహలలో, తమ పురాణాలలో ఉన్న పాత్రలు రవివర్మ రూప కల్పన చేసిన చిత్రాల్లాగా మారిపోయాయి అంటే అతిశయోక్తి లేదు.**

రవివర్మ చిత్రాలకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులున్నారు. మరి ఆయన చిత్రాల్లో కనిపించే ముగ్ధమనోహర సౌందర్యవతి నిజంగానే ఈ భూమి మీద ఉందా లేదా ఊహా సుందరియా అన్న అనుమానం చాలామందికి వస్తుంది. అయితే అంజనీ బాయి మాల్పేకర్ రవివర్మ చిత్రాలకు నమూన అని అంటారు. సంగీత కళాకారిణిగానే ఎక్కువ మందికి తెలిసిన ఆమె... రవివర్మ కుంచెతో ప్రాణం పోసుకున్న లేడీ ఇన్ ది మూన్లైట్", "లేడీ ప్లేయింగ్ స్వర్బాట్", "మోహిని" ,"ది హార్ట్‌బ్రోకెన్" తదితర చిత్రాలకు ప్రేరణ అని అతి తక్కువ మందికి తెలుసు.

పండిత్ అంజనీబాయి మాల్పేకర్ (22 ఏప్రిల్ 1883 – 7 ఆగస్టు 1974) ప్రముఖ భారతీయ సంప్రదాయ సంగీత గాత్ర కళాకారిణి. హిందూస్థానీ సంగీతంలో భెండి బజార్ గరానా శైలిలో ఆమె ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. ఆమె ప్రముఖ సంగీత విధ్యాంసుడు ఉస్తాద్ నజీర్ ఖాన్ శిష్యురాలు. గోవాలోని మాల్పేలో 22 ఏప్రిల్ 1883లో కొంకణి భాష మాట్లాడే గోవా సంగీత కారుల కుటుంబంలో అంజనీ జన్మించారు. ఆమె తాత గుజాబాయి, తల్లి నబుబాయిలు సంగీత ప్రపంచంలో చాలా ప్రసిద్ధి చెందిన వారు. తన 8వ ఏట ఉస్తాద్ నజీర్ ఖాన్ వద్ద భెండి బజార్ గరానా శైలిలో సంగీత శిక్షణ తీసుకున్నారు. గురువుతో పాటు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ అందుకున్న మొదటి మహిళగా ఆమె పేరు నమోదు చేసుకున్నారు. ఎనిమిదేండ్ల పాటు కఠోన సంగీత సాధన చేసిన ఆమె 1899లో తన 16వ ఏట ముంబైలో మొదటిసారి కచేరి చేశారు. ఆ సమయంలో మహిళలు ప్రదర్శనలు ఇచ్చేవారు కాదు. కానీ అంజనీ మాత్రం తన కచేరీల ద్వారా ఎంతో గౌరవం పొందారు.

1920 వరకు ఆమె సంగీత కెరీర్ చాలా బాగా సాగింది. అయితే ఆమె గురువు చనిపోవడంతో ప్రజా ప్రదర్శనలకు దూరమైనారు. అందమైన ఆమె రూపం కూడా ప్రదర్శనలకు దూరం కావడానికి ఒక కారణం. కచేరిలో కొందరు ప్రేక్షకుల నుంచి వచ్చే వేధింపులు ఆమెను బాధించేవి. దాంతో ఆమె కచేరిలు ఆపేసి 1923 నుంచి పూర్తిగా సంగీత శిక్షణకే సమయం కేటాయించేవారు. ఆమె వద్ద సంగీతం నేర్చుకున్న కుమార్ గాంధర్వ, కిషోర్ అమోంకర్ ప్రసిద్ధ సంగీత కళాకారుడిగా పేరు తెచ్చుకున్నారు. అద్భుతమైన గాత్రంతో పాటు అపూర్వమైన అందం ఆమె సొంతం. ప్రముఖ చిత్రకారుడు ఎం.వి. ధురంధర్ ఆమె చిత్రాన్ని గీసినప్పుడు రవివర్మ చూసి అబ్బురపడ్డారట. తమ చిత్రాల ర్పూప కల్పనకు ఆమెను ప్రేరణగా తీసుకున్నారు. "లేడీ ఇన్ ది మూన్లైట్", "లేడీ ప్లేయింగ్ స్వర్బాట్", "మోహిని", "ది హార్ట్‌బ్రోకెన్" తదితర చిత్రాలకు అంజనీ ప్రేరణగా నిలిచారు.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

# దేశభక్తి ముసుగులో కాషాయ వ్యూహం

## గ్రామాల్లో శివాజీ విగ్రహాల రాజకీయ కథ!

(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)



తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా గ్రామ గ్రామాన శివాజీ మహారాజు విగ్రహాలు ఇటీవల అత్యధిక సంఖ్యలో వెలుస్తున్న దృశ్యం కేవలం ఒక సాంస్కృతిక ఉద్యమం కాదు. అది ఒక లోతైన రాజకీయ-సామాజిక మార్పిడి. హిందూ ధర్మ సమాజ రక్షణ అనే నేపథ్యంలో దేశభక్తిని తన లక్ష్యంగా చూపించి, వాస్తవంలో హిందూ కాషాయీకరణను గ్రామ స్థాయిలో నాటుతున్న వ్యూహాత్మక ప్రయత్నం. గతంలో స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల విగ్రహాలు ఏకైక గ్రామీణ చిహ్నాలుగా ఉండేవి. ఇప్పుడు ఆ స్థానాన్ని శివాజీ ఆక్రమిస్తున్నారు. ఈ మార్పు యొక్క లోతును అర్థం చేసుకోవాలంటే, దాని వెనుక ఉన్న ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు, బీజేపీ రాజకీయ లాభాలు, సినిమా సాధనం వంటి అంశాలను సమగ్రంగా విశ్లేషించాలి.

గత కాలంలో గ్రామాల్లో భగత్ సింగ్, జవహర్‌లాల్ నెహ్రూ, డా. బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, ఇందిరా గాంధీ, స్వామి వివేకానందల విగ్రహాలు మాత్రమే ప్రతిష్ఠితమవుతుండేవి. ఇవి భారత స్వాతంత్ర్య పోరాటం, సమాజ సంస్కరణ, లౌకికత్వం, ఐక్యత వంటి విలువలను ప్రతిబింబించేవి. ఈ విగ్రహాలు ఏ ఒక్క మతం లేదా సంప్రదాయానికి పరిమితం కాకుండా, మొత్తం జాతిని ఒక్కటి చేసే చిహ్నాలుగా నిలిచాయి. కానీ ఇప్పుడు ఆ స్థానాన్ని శివాజీ విగ్రహాలు ఆక్రమించడం యాదృచ్ఛికం కాదు. ఇది ఆర్ఎస్ఎస్ సంస్థలు గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న చురుకైన కార్యక్రమాలు, హిందూ ధార్మిక మహాసభలతో ముడిపడి ఉంది. ప్రతి గ్రామంలో అట్టహాసంగా వేడుకలు, ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ఈ విగ్రహాలను కేవలం చారిత్రక వ్యక్తి కాకుండా, "హిందూ సమాజ రక్షకుడు"గా స్థాపించడం జరుగుతోంది.

ఈ ప్రక్రియకు ఇటీవలి కాలంలో ఒక బలమైన సాంస్కృతిక ఆయుధం లభించింది -- 'చావా' చిత్రం. గత ఏడాది విడుదలైన ఈ సినిమా శివాజీ తనయుడు సంభాజీ మహారాజు యొక్క వీరత్వం, ధైర్యం, హిందూ సమాజ రక్షణను కేంద్రంగా చిత్రీకరించి భారతీయ ప్రజల మనసుల్లో గాఢంగా నాటుకుపోయింది. కానీ ఇది ఒక్కటే కాదు. 'కాశ్మీర్ ఫైల్స్' (2022), 'ది కేరళ స్టోరీ' (2023) వంటి చిత్రాలు కూడా ఇదే వ్యూహంలో భాగమయ్యాయి. కాశ్మీర్ ఫైల్స్ కాశ్మీరీ పండిట్ల బాధలను గ్రాఫిక్‌గా చూపి ముస్లింలను సాధారణీకరించి హింసాత్మకులు, ద్రోహులుగా చిత్రీకరించింది. కేరళ స్టోరీ 'లవ్ జిహాద్' అనే వివాదాస్పద థీరీని ఆధారం చేసుకొని ముస్లిం యువకులను హిందూ-క్రిస్టియన్ అమ్మాయిలను ఆకర్షించి ఉగ్రవాదంలోకి నెట్టేవారిగా చూపి సామాజిక ధ్రువీకరణను రెచ్చగొట్టింది. ఈ చిత్రాలన్నింటినీ భారతీయ జనతా పార్టీ సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. సినిమా ద్వారా సృష్టించిన భావోద్వేగాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవడం బీజేపీ వ్యూహంలో కొత్త కాదు. కానీ ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఈ చిత్రాలు దేశభక్తిని కాకుండా, హిందూ ధర్మ రక్షణను ప్రధాన థీమ్‌గా ఎత్తి చూపి బీజేపీ-ఆర్ఎస్ఎస్ కలయిక ద్వారా జరుగుతున్న "కాషాయీకరణ" ప్రక్రియకు బలం చేకూరుస్తున్నాయి.

ఈ వ్యూహం యొక్క లోతైన అర్థం ఏమిటి? ఇది రాజకీయ లబ్ధి కోసం చేసే లెక్కలు. గ్రామ స్థాయిలో హిందూ ఐక్యతను సృష్టించడం ద్వారా బీజేపీ తన ఓటు బ్యాంకును విస్తరించుకోవాలని చూస్తోంది. దేశభక్తి అనే ఉదాత్తమైన భావనను హిందూ ధర్మ సంరక్షణతో ముడిపెట్టడం ద్వారా, మతపరమైన ధ్రువీకరణను ప్రోత్సహిస్తుంది. ఇది భారతదేశం యొక్క లౌకిక స్వభావాన్ని, సమగ్ర జాతీయతను క్రమంగా కుంచింపచుతుంది. గతంలో జాతీయ నాయకుల విగ్రహాలు స్వాతంత్ర్య సమరం, సామాజిక న్యాయం, మతనిరపేక్షత వంటి విలువలను ప్రతిబింబించాయి. వాటిని భర్తీ చేస్తున్న శివాజీ విగ్రహాలు మాత్రం ఒక నిర్దిష్ట చారిత్రక సందర్భంలోని మరాఠా యోధుడిని, మొఘల్ సామ్రాజ్యంతో (అంటే ముస్లిం పాలనతో) జరిగిన సంఘర్షణను హిందూ-ముస్లిం ధృష్టికోణంలో చూపించడం ద్వారా సమాజంలో ఇప్పటికే ఉన్న విభేదాలను మరింత లోతుగా చేస్తాయి.

ఆర్ఎస్ఎస్ దీర్ఘకాలిక సాంస్కృతిక ప్రాజెక్ట్ ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామాల్లో ధార్మిక మహాసభలు, కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా హిందూ సమాజాన్ని ఒక రాజకీయ బ్లాక్‌గా మార్చడం జరుగుతోంది. బీజేపీ దీన్ని ఎన్నికల లాభంగా మార్చుకోవడం సహజం. కానీ ఈ ప్రక్రియ దేశం మొత్తం సామాజిక సామరస్యానికి, లౌకిక రాజ్యాంగ విలువలకు ఎంత పెద్ద సవాలుగా మారుతుందో గుర్తించాలి. జాతీయ నాయకుల విగ్రహాలు ఏకత్వాన్ని నిర్మించాయి. శివాజీ విగ్రహాలు మాత్రం ఒక నిర్దిష్ట ధార్మిక గుర్తింపును బలపరుస్తాయి. ఇది భారతదేశం యొక్క వైవిధ్యభరితమైన సమాజాన్ని ఒక ఏకపక్ష హిందూ దృక్పథంతో చూడడానికి దారి తీస్తుంది.


ఈ నేపథ్యంలో ఒక విషయం స్పష్టం -- దేశభక్తి నిజమైనది కావాలంటే అది అన్ని వర్గాలను, అన్ని మతాలను కలుపుకొని ఉండాలి. హిందూ కాషాయీకరణ ద్వారా రాజకీయ లాభాలు పొందడం స్వల్పకాలిక విజయం కావచ్చు, కానీ దీర్ఘకాలికంగా దేశ ఐక్యత, సామాజిక స్థిరత్వానికి హాని చేస్తుంది. గ్రామాల్లో శివాజీ విగ్రహాలు ఎంత భారీగా వెలుస్తున్నాయో, అంతగా మనం ఆలోచించాలి -- ఇది నిజంగా దేశాన్ని బలపరుస్తుందా, లేక ఒక నిర్దిష్ట రాజకీయ ఎజెండాను గ్రామ స్థాయి నుంచి బలపరుస్తుందా? ఈ



# మానవ మనుగడకు సవాలుగా కాలుష్యం

## నేడు ప్రపంచ ధరిత్రి దినోత్సవం

**సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచభూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింప బడడం కనిపిస్తుంది.**



భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఈ క్రమంలోంచి వచ్చిందే 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం'. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న 'ధరిత్రి దినోత్సవం' జరుపు కుంటున్నారు. 1962లో అమెరికన్ సెనెటర్ నెల్సన్‌కి వచ్చిన ఆలోచనకు ప్రతిరూపమే ఈ ధరిత్రీ దినోత్సవం. 1969లో నెల్సన్ మన వాతావరణంలో జరిగే మార్పులనూ వివరిస్తూ మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మన వంతు ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ తన మిత్రులకు మరియు ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ఈ ధరిత్రీ దినోత్సవం గూర్చి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రీ దినోత్స వం జరిగింది. ఆరోజు ఆ దేశంలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించు కునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేసారు. ఇలా తొలుత అమెరికాలో ప్రారంభమైన ఈ ఉత్సవం ఆ తర్వాత ప్రపంచ వ్యాపితమైంది.

వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయి ఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షుట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలోనే ప్రారంభం కావడం విశేషం. 50 ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. అప్పటి నుంచీ సుస్థిర అభివృద్ధి కోసం ధరిత్రి దినోత్సవం జరుపుకుం టున్నాం. ప్రపంచ వ్యాప్తంగా 175 కంటే ఎక్కువ దేశాల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

అనాలోచిత మానవ చర్యల వల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా మనిషి చేస్తున్న పనుల వల్ల భూగోళం అమితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయుకాలుష్యం పెచ్చు మీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పది లంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియోగించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్దే సుస్థిరాభివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది.

**భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించు కోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించ గలగాలి. అడవుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి..**

పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది.

భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్సరంలో "పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విషవాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ళు, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది.

మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది.

**తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటు వంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒక వేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతో పాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహ త్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్ష ణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఏదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# చాహల్ వద్దు.. కోహ్లీ లాంటోడు కావాలి

**బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా**

టీమిండియా వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో తాను డేటింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలను బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కొట్టిపారేసింది. ఇలాంటి వార్తలతో తాను విసిగిపోయానని అసహనం వ్యక్తం చేసింది. కలిసి డిన్నర్ చేసినంత మాత్రాన డేటింగ్ అంటూ ప్రచారాం చేస్తారా? అని మండిపడింది. యుజ్వేంద్ర చాహల్‌తో కలిసి షెఫాలీ బగ్గా ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు వెలువడ్డాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించిన షెఫాలీ బగ్గా.. తనకు చాహల్ వద్దని, కోహ్లీలాంటి అబ్బాయి కావాలని పేర్కొంది. ఇలాంటి చిన్న చూపుతో తాను విసిగిపోయానని పేర్కొంది. వాస్తవం ఏంటో తనకు, తన ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది. తనకు క్రికెటర్లతో డేటింగ్ చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. 'ఇది నా వృత్తి. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన నాకు లేదు. నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. అతను ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ప్రేమ, అంకితభావం, ఆరాధన నాకు చాలా ఇష్టం. నా భాగస్వామి నాతో ఉన్నప్పుడు పూర్తిగా నాకే సమయం కేటాయించాలి. నాపైనే పూర్తి శ్రద్ధ పెట్టాలి. నా పార్ట్‌నర్‌కు లగ్జరీల కంటే ప్రేమించే మనసు,నన్ను కేర్ చేసే గుణం ఉంటే చాలు. ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే నా కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాను. 'అని షెఫాలీ బగ్గా చెప్పుకొచ్చింది. ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక టోర్నీలకు యాంకర్‌గా వ్యవహరిస్తున్న షెఫాలీ.. త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.



# చిక్కుల్లో యూసఫ్ పఠాన్

మహానగరం ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో జరిగిన ఒక చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, చివరకు పోలీసు కేసులకు దారితీసింది. టీమ్ ఇండియా మాజీ ఆటగాడు యూసుఫ్ పఠాన్ మామ, ఆయన కుమారుడు మరియు మరో బంధువు కలిసి ఒక వ్యక్తిపై, అతని కుటుంబంపై దాడి చేశారనే ఆరోపణలతో ముంబై పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ గొడవ రెండు రోజుల క్రితం ప్రారంభమైంది. ముంబైలో కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరింది. ఆ దారిలో వెళ్తున్న ఒక కారు, గుంతలోని నీటిని రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిపై చిమ్మింది. ఈ చిన్న కారణంతో ఆగ్రహానికి గురైన నిందితులు, కారులో ఉన్న వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా ముదిరి పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన బైకుల్లా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు.ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా నిందితులను స్పష్టంగా గుర్తించారు.దాడికి ఉపయోగించిన వెదురు కర్రలు, బేస్ బాల్ బ్యాట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై భారతీయ న్యాయ సంహిత (గతంలో ఖాజ) లోని సెక్షన్ 118(2), 115(2), 324, 352, 351(2), మరియు 3(5) కింద కేసులు నమోదు చేశారు.ప్రస్తుతం ముగ్గురిని అరెస్ట్ చేయగా, ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. నిందితులను కోర్టులో హాజరుపరిచినప్పుడు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు మరియు సీసీటీవీ ఫుటేజ్ తమ వద్ద బలంగా ఉన్నాయని పోలీసులు కోర్టుకు వివరించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచార పర్వం కొనసాగుతున్న తరుణంలో,ఒక సిట్టింగ్ ఎంపీ అయిన యూసుఫ్ పఠాన్ బంధువులు ఇలాంటి గొడవల్లో అరెస్ట్ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యర్థి పార్టీలు ఈ అంశాన్ని ప్రచారంలో ప్రస్తావించే అవకాశం కనిపిస్తోంది.నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, ఒత్తిడి వల్ల చిన్న చిన్న కారణాలకే ప్రజలు విచక్షణ కోల్పోయి దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డుపై వెళ్లేటప్పుడు సహనం పాటించకపోతే, అది ఎంతటి వారినైనా చట్టం ముందు నిలబెడుతుందని ఈ ఘటన మరోసారి నిరూపించింది. పోలీసులు పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# సొంతగడ్డపై సన్ రైజర్స్ శివతాండవం!




## అభిషేక్ శర్మ సుడిగాలి శతకం

### ఢిల్లీ క్యాపిటల్స్ పై 47 పరుగుల తేడాతో ఘనవిజయం

### ఉప్పల్ లో చెలరేగిన బ్యాటర్లు, బౌలర్లు



**హైదరాబాద్, ఏప్రిల్ 21:** ఐపీఎల్ టోర్నీలో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు సొంతగడ్డపై మరోసారి విశ్వరూపం ప్రదర్శించింది. ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వేదికగా మంగళవారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించి 47 పరుగుల భారీ తేడాతో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ ఏకంగా 242 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ జట్టు 195 పరుగులకే పరిమితమై పరాజయాన్ని మూటగట్టుకుంది.

**టాస్ గెలిచి బొక్కబోర్లా పడ్డ ఢిల్లీ..**

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు అనుకూలిస్తున్న పిచ్ పై ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయాలన్న వ్యూహం దారుణంగా బెడిసికొట్టింది. సన్ రైజర్స్ ఓపెనర్లు ఆది నుంచే విరుచుకుపడ్డారు. ముఖ్యంగా యువ సంచలనం అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఢిల్లీ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ మైదానం నలుమూలల బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 68 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరును అందించాడు. అతనికి జతగా ట్రావిస్ హెడ్ (26 బంతుల్లో 37 పరుగులు) చక్కటి సహకారం అందించాడు. చివర్లో హెన్రిచ్ క్లాసెన్ కేవలం 13 బంతుల్లోనే 37 పరుగులతో అజేయంగా నిలిచి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. నిర్ణీత 20 ఓవర్లలో హైదరాబాద్ జట్టు 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల కొండంత స్కోరును నమోదు చేసింది. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ ఒక్క వికెట్ పడగొట్టాడు.

**లక్ష్య ఛేదనలో తడబడిన ఢిల్లీ..**

243 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఏ దశలోనూ విజయావకాశాలు కనిపించలేదు. భారీ స్కోరు ఛేదించాలన్న ఒత్తిడిలో బ్యాటర్లు వరుసగా పెవిలియన్ కు క్యూ కట్టారు. నితీశ్ రాణా (30 బంతుల్లో 57 పరుగులు), సమీర్ రిజ్వీ (28 బంతుల్లో 41 పరుగులు), కేఎల్ రాహుల్ (23 బంతుల్లో 37 పరుగులు) పోరాడే ప్రయత్నం చేశారు. మిగతా బ్యాటర్లు ఎవరూ వారికి కనీస సహకారం అందించలేకపోయారు. పెరిగిన రన్ రేట్ ను చేరుకునే క్రమంలో భారీ షాట్లకు యత్నించి వికెట్లు పారేసుకున్నారు.

**కదం తొక్కిన హైదరాబాద్ బౌలర్లు..**

భారీ స్కోరును కాపాడుకునే క్రమంలో సన్ రైజర్స్ బౌలర్లు అద్భుతంగా రాణించారు. యువ పేసర్ ఇషాన్ మలింగ ఢిల్లీ బ్యాటింగ్ లైనప్ ను శాసించాడు. తన 4 ఓవర్ల స్పెల్ లో కేవలం 32 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టాడు. హర్ష్ దూబే కూడా కేవలం 2 ఓవర్లలో 11 పరుగులిచ్చి 3 వికెట్లు నేలకూల్చాడు. సాకిబ్ హుస్సేన్ ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. హైదరాబాద్ బౌలర్ల ధాటికి ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 195 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ సీజన్ లో సన్ రైజర్స్ బ్యాటింగ్ లైనప్ ఎంత భయంకరంగా ఉందో ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. ఓపెనింగ్ లోనే భారీ స్కోరుకు పునాది పడటంతో మిడిల్ ఆర్డర్ స్వేచ్ఛగా ఆడే అవకాశం దక్కుతోంది. అభిషేక్ శర్మ ఫామ్ ప్రత్యర్థి బౌలర్లకు పీడకలగా మారింది. బౌలింగ్ లోనూ యువ ఆటగాళ్లు సత్తా చాటుతుండటం ఆ జట్టుకు శుభసూచకం. ఏ రకంగా చూసినా ఈ మ్యాచ్ పై సన్ రైజర్స్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి అభిమానులకు అద్భుతమైన వినోదాన్ని పంచింది.



# ప్రఫుల్ హింగేపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వేటు



వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిపించిన యువ పేసర్ ప్రఫుల్ హింగేపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వేటు వేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో రెండు మార్పులతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ప్రఫుల్ హింగే, లివింగ్ స్టోన్‌లను తుది జట్టు నుంచి తప్పించి ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్ లిస్ట్‌లో చేర్చింది. పిచ్ స్పిన్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ తెలిపాడు. ఎక్కువ స్పిన్ ఆప్షన్స్ కోసం ప్రఫుల్ హింగేను పక్కనపెట్టామని చెప్పాడు. దిల్షాన్ మదుషంక తుది జట్టులోకి వచ్చాడని ఇషాన్ కిషన్ తెలిపాడు. అయితే ప్రఫుల్ హింగే, మదుషంకలో ఒకరే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడుతారని చెప్పాడు.ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన ఇషాన్ కిషన్.. గత మ్యాచ్‌లతో పోల్చితే ఇది భిన్నమైన వికెట్ అని తెలిపాడు. 'ఈ పిచ్‌పై ఇప్పుడే ఒక నిర్ణయానికి రాలేం. ఎందుకంటే గత కొన్ని మ్యాచ్‌ల్లో మేం ఆడిన వికెట్ లాగా ఇది లేదు. పిచ్ కండిషన్స్ బట్టి ఆడాల్సి ఉంది. ఈ రోజు మా తుది జట్టులో కొన్ని మార్పులు ఉన్నాయి, మధుషంక బరిలోకి దిగుతుండగా.. ప్రఫుల్ హింగే బెంచ్‌కే పరిమితం కానున్నాడు. ఈ విషయంపై నాకు క్లారిటీ లేదు. హర్ష్‌దూబే తిరిగి జట్టులోకి వచ్చాడు. ఎందుకంటే ఇది కొంచెం స్లో ట్రాక్. వికెట్లు తీయడానికి మాకు స్పిన్ ఆప్షన్ ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నాం. మా కుర్రాళ్లు అద్భుతంగా రాణిస్తున్నారు. ఫలితాలను చూసి ఈ మాట చెప్పడం లేదు. మా ప్రణాళికలను వారు అమలు చేస్తున్న విధానం, వారి మనస్థత్వం చూసి ఈ మాట అంటున్నా. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. టాస్ విషయంలో తమకు అదృష్టం కలిసి వస్తుందన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడుతానని అనుకోలేదని, ఈ రోజు విజయం దక్కుతుందనే ఆశాభావంతో ఉన్నానని వెల్లడించాడు. తమ తుది జట్టులో ఒక మార్పు చేశామని చెప్పిన అక్షర్ పటేల్.. ఆకీబ్ స్థానంలో నితీష్ రాణా బరిలోకి దిగుతున్నాడని తెలిపాడు.



# నువేక్ష హాట్ షో

## ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో హల్‌చల్

యంగ్ బ్యూటీ నువేక్ష తన తాజా ఫోటోషూట్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్టైలిష్ లుక్స్‌తో ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఈ హీరోయిన్, ఇప్పుడు మరింత గ్లామర్ టచ్‌తో ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేస్తోంది. క్రీమ్ వైట్ కలర్ కట్‌అవుట్ డ్రెస్‌లో నువేక్ష కనిపించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది. గోల్డ్ బకుల్ డీటైల్స్‌తో డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్ బోల్డ్‌గా ఉన్నప్పటికీ క్లాసీ లుక్‌ను ఇస్తోంది. నేచురల్ లైట్‌లో తీసిన ఈ ఫోటోలు డ్రీమీ ఫీల్‌ను కలిగిస్తూ ప్రతి ఫ్రేమ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. సన్‌లైట్ విండోస్ దగ్గర పోజులు ఇచ్చినా, డార్క్ బ్యాక్‌డ్రాప్ ముందు నిలిచినా నువేక్ష కాన్ఫిడెన్స్ స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఎలిగెంట్ స్టైల్‌తో పాటు స్క్రీన్ ప్రెజెన్స్ ప్రతి ఫోటోలో హైలైట్ అవుతోంది. ఈ కొత్త అవతార్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నువేక్ష అందంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు





# మోస్ట్ పాపులర్ స్టార్స్ జాబితా విడుదల

## టాప్‌లో ప్రభాస్, సమంత

## ఓరామాక్స్ విడుదల చేసిన మార్చి ర్యాంకింగ్స్

టాలీవుడ్ స్టార్ హీరోలు, హీరోయిన్లలో క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని మరోసారి స్పష్టమైంది. దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ తారలు మళ్లీ టాప్ స్థానాల్లో నిలిచారు. మార్చి నెలకు సంబంధించిన మోస్ట్ పాపులర్ ఫిలిం స్టార్ల జాబితాను ఓరామాక్స్ మీడియా విడుదల చేయగా, హీరోలలో ప్రభాస్, హీరోయిన్లలో సమంత అగ్రస్థానాల్లో నిలిచారు. హీరోల విభాగంలో ప్రభాస్ మొదటి స్థానాన్ని దక్కించుకోగా, ఆయన తరువాత అల్లు అర్జున్, విజయ్ దళపతి, షారుఖ్ ఖాన్, మహేష్ బాబు వరుసగా నిలిచారు. అలాగే రామ్ చరణ్, సల్మాన్ ఖాన్, రణవీర్ సింగ్, ఎన్టీఆర్, అక్షయ్ కుమార్ కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ ర్యాంకింగ్స్ స్టార్ హీరోల పాపులారిటీని మరోసారి చూపిస్తున్నాయి. హీరోయిన్ల జాబితాలో సమంత టాప్ ప్లేస్ సాధించగా, ఆమె తరువాత ఆలియా భట్, రష్మిక మందన్న, కాజల్ అగర్వాల్, సాయి పల్లవి ఉన్నారు. నయనతార, త్రిష, కృతి సనన్, శ్రీలీల కూడా ఈ జాబితాలో తమ స్థానాలను సంపాదించుకున్నారు. మొత్తంగా చూస్తే, సౌత్ మరియు బాలీవుడ్ తారలు కలిసి ఈ జాబితాలో ఆధిపత్యం చాటడం విశేషం. అభిమానుల్లో వీరి క్రేజ్ ఇంకా బలంగానే కొనసాగుతోందని ఈ ర్యాంకింగ్స్ స్పష్టం చేస్తున్నాయి

# సిల్వర్ అండ్ గోల్డ్ లుక్‌లో ఐశ్వర్య మేనన్

## మెరిసిపోతున్న 'స్పై' సుందరి! వైరల్ అవుతున్న లేటెస్ట్ ఫోటోషూట్..

## గ్లామర్ విందులో నెక్స్ట్ లెవెల్

దక్షిణాది చిత్రాల్లో తనదైన నటనతో మెప్పిస్తున్న అందాల తార ఐశ్వర్య మేనన్ తాజాగా చేసిన ఫోటోషూట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, కోలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఫ్యాన్ బేస్‌ను సంపాదించుకుంది. టాలీవుడ్‌లో నిఖిల్ సరసన 'స్పై', కార్తికేయతో 'భజే వాయు వేగం' వంటి చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యింది. ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వనప్పటికీ, ఐశ్వర్య అందానికి మరియు నటనకు మాత్రం మంచి మార్కులే పడ్డాయి. తెరపై సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నా, సోషల్ మీడియాలో మాత్రం ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తన అప్డేట్స్ షేర్ చేస్తూనే ఉంటుంది. తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఫోటోలు చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. సిల్వర్ మరియు గోల్డ్ కలర్ సీక్విన్ చీరలో ఐశ్వర్య దేవకన్యలా మెరిసిపోతోంది. దీనికి తోడు హెవీ ఎంబ్రాయిడరీ చేసిన కార్సెట్ బ్లౌజ్ ఆమె లుక్‌కు మరింత రాయల్ టచ్ ఇచ్చింది. స్టైలిష్ మేకప్, ఎలిగెన్స్ కలగలిసిన ఐశ్వర్య ఫోజులు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ తన గ్లామర్‌ను సరికొత్తగా ఆవిష్కరిస్తూ ఫ్యాన్స్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. "సినిమా రిజల్ట్ ఎలా ఉన్నా, నీ గ్లామర్ మాత్రం తగ్గేదేలే" అంటూ నెటిజన్లు కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో వైరల్ అవుతూ, ఐశ్వర్య మేనన్ క్రేజ్‌ను మరింత పెంచుతున్నాయి.



# ప్యారడైజ్ కోసం రెండేళ్ల సమయం కేటాయింపు

## నటి కాయదు లోహార్ సంచలన నిర్ణయం



తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహార్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' సినిమా కోసం కాయదు లోహార్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహార్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ 'ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహార్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో 'సైజ్ జీరో' కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహార్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'ప్యారడైజ్' విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com